భవిష్యత్ ప్రజాపాలన
మా వార్త రేపటి భవిష్యత్తుకు నిదర్శనం
తెలుగు దినపత్రిక
bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in
ASN NEWS
ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి తెలంగాణ - రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 269 గురువారం , అక్టోబర్ 29, 2026 , పేజీలు - 12 వెల : 1 /-

కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

48.54 లక్షల మంది ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లకు లబ్ది



న్యూఢిల్లీ,అక్టోబర్ 28 : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. కరవు భత్యం (డీఏ), కరవు ఉపశమనం (డీఆర్)ను 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 60 శాతంగా ఉన్న డీఏ, డీఆర్ తాజా పెంపుతో 63 శాతానికి చేరనున్నాయి. ఈ పెంపు 2026 జూలై 1 నుంచి అమల్లోకి వస్తుంది. దేశవ్యాప్తంగా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి రూ.10,016.10 కోట్ల అదనపు భారం పడనుంది. పెరిగిన ధరల ప్రభావం నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు కొంత ఉపశమనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం మిగతా2లో...

కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

ముందస్తు చర్యలు చేపడుతున్నాం.. కేంద్రానికి ఇప్పటికే నివేదిక పంపించాం

అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్ష బృందం

విపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్,అక్టోబర్ 28 : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన కరువు పరిస్థితులను అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఎల్‌నినో మిగతా2లో...

అప్రమత్తంగా ఉండండి..

- తాగునీటి సమస్య రానివ్వొద్దు!

ఎల్‌నినో నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

క్యూర్ ఏరియాలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు వందశాతం పనిచేయాలి

భవన నిర్మాణాలు, పార్కులు, రోడ్ల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి

శుద్ధి చేసిన నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ.. నవంబర్ 1 నుంచి ఆదేశాల అమలు

హైదరాబాద్,అక్టోబర్ 28 : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలాశయాల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వందశాతం సామర్థ్యంతో మిగతా2లో...

ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,అక్టోబర్ 28 : ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. గతంలో ఓటర్లుగా నమోదైన వారి పేర్లు తొలగించినప్పుడు, మళ్లీ ఫారం6 సమర్పించాలని ఎందుకు కోరుతున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. సాధా రణంగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు ఫారం6 ఉపయోగిస్తారని ధర్మాసనం గుర్తుచేసింది.ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని మిగతా2లో...

ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

● నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్

● 7వ తేదీన ఓట్ల లెక్కింపు.. ఎన్నికల సంఘం షెడ్యూల్‌లో మార్పులు

అమరావతి,అక్టోబర్ 28 : ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది. నవంబర్ 3న నిర్వహించాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు వాయిదా వేసింది. అదే రోజు జరగాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 7కు మార్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది కొరత, ఇతర ఏర్పాట్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. **మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌లోనూ మార్పులు** ఇప్పటికే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది. మిగతా2లో...

ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

- ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సాంకేతికతను వినియోగించాలి: భట్టి విక్రమార్క

వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

● ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీ వెళ్లి తీరుతాం: మహేశ్‌కుమార్ గౌడ్ ● ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

హైదరాబాద్,అక్టోబర్ 28 : మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు మిగతా2లో...

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

సబితా ఇంద్రారెడ్డి హౌస్ అరెస్టుపై హరీశ్‌రావు ఖండన

ప్రజల గొంతు నొక్కడం సరికాదు: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్ 28: మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గృహ నిర్బంధం చేయడంతో పాటు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్‌ఎస్ నేత కార్తిక్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు.

మిగతా2లో...

గురువారం,
అక్టోబర్ 29, 2026
భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక

అప్రమత్తంగా ఉండండి..

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని వృథా చేయకుండా వివిధ అవసరాలకు వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి అవసరాలు పెరిగే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. **భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటినే వాడాలి** సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు పరిధి, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్కుల నిర్వహణ, రోడ్ల శుభ్రతకు కూడా శుద్ధి చేసిన నీటినే ఉపయోగించాలని ఆదేశించారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. **ప్రైవేటు మురుగునీటి శుద్ధి కేంద్రాల** ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా కేంద్రాలకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీపీల నిర్వహణకు సౌర విద్యుత్తును వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. శుద్ధి కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక ప్రమాణాలను పాటించాలని, నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. **శుద్ధి కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ** ప్రతి మురుగునీటి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని కేంద్రాలను కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను గుర్తించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నీటి వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, శుద్ధి చేసిన నీటి సరఫరా కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం 26 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి శుద్ధి చేసిన నీటిని పచ్చరంగు ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. **సమీక్షలో ఉన్నతాధికారులు** ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు తావివ్వకుండా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. **కేంద్రానికి నివేదిక.. అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్షం** రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి తెలంగాణకు రావాల్సిన సహాయంపై కేంద్రాన్ని కోరుతామని తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు చేసిన సూచనలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంపై గతంలో శాసనసభలో చర్చించామని, శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని తెలిపారు. **తాగునీరు, పశువుల మేతకు ప్రాధాన్యం** దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు ఉండటంతో పాటు ఎగువ రాష్ట్రాల్లోనూ వర్షాలు తక్కువగా కురవడం వల్ల ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహాలు తగ్గాయని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వర్షాభావ ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

(మొదటి పేజీ తరువాయి)

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు కాంగ్రెస్ ప్రభుత్వం కరువు బారిన పడిన రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం మానేసి, మూసీ ప్రక్షాళన పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరువు బాధిత రైతులను ఆదుకోవడంపై చూపాల్సిన శ్రద్ధను ప్రభుత్వం చూపడం లేదని విమర్శించారు. **రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా తనను, తన కుమారుడిని గృహ నిర్బంధం చేయడంపై మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోకుండా మూసీ ప్రాజెక్టుకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరువు బారిన పడిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని, కాళేశ్వరం నీటిని వినియోగించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. **ప్రజాభిప్రాయ సేకరణ అందరితో జరపాలి** ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజల గొంతు నొక్కడం సరికాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతల అరెస్టులను అక్రమంగా అభివర్ణించారు. మూసీ ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో ప్రభుత్వం విభజించి పాలించే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ప్రజలందరితో ఒకేసారి అభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులకు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

12 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

- జయేష్ రంజన్‌కు పర్యావరణ శాఖ
- వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబర్ 28 : తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం, శాఖల నిర్వహణ అవసరాల దృష్ట్యా ప్రభుత్వం 12 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలు, నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను ఇంధన శాఖకు బదిలీ చేశారు. ఇంధన శాఖలో పనిచేస్తున్న నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఏ. వాణిప్రసాద్‌కు తెలంగాణ పురావస్తుశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖలో దేవాదాయ విభాగం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. కే. ఇలంబర్తిని రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా నియమించి, రవాణా శాఖ కమిషనర్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఆయన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి పురపాలక సంస్థల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అదనంగా ఇచ్చారు. ఆయన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాధ్యతల్లోనూ కొనసాగుతారు. మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓఝాను నియమించారు. ఎస్. సంగీత సత్యనారాయణను ఆ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. మహమ్మద్ ముషారఫ్ అలీ ఫారూఖీని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించి, తెలంగాణ రైతు విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌కు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, నిర్వహణ సంచాలకుడిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పదవీ విరమణ నేపథ్యంలో ఎం. దానకిశోర్‌ను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, అక్టోబర్ 28 : ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిం చనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు ద్వారా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు. ఇదిలా ఉండగా, నవంబర్ 4న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి హాజరుకావాలని శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. **గ్రామీణాభివృద్ధికి రూ.7,395 కోట్ల పథకం** ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐదేళ్లలో రూ.7,395.55 కోట్ల వ్యయంతో 202627 నుంచి 203031 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా 2.78 లక్షలకు పైగా గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది. **కంటైనర్, క్రీడా వస్తువుల తయారీకి ప్రోత్సాహం** దేశీయ కంటైనర్ తయారీ పరిశ్రమను బలోపేతం చేసేందుకు రూ.10 వేల కోట్ల ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలిపారు. అలాగే క్రీడా వస్తువుల తయారీ రంగ అభివృద్ధికి రూ.1,856.67 కోట్లతో ఖేలో ఇండియా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయాలతో దేశీయ తయారీ రంగం, గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధికి ఊతం లభించనుంది.

ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం విచారణ సందర్భంగా, చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలకు సాధారణంగా ఫారం8 ఉపయోగిస్తారని పేర్కొంది. పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, ఢిల్లీలో ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి సుమారు 43 లక్షల మంది పేర్లు తొలగించారని తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైనవారిని తిరిగి చేర్చేందుకు ఫారం6 కోరడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలను గడువు ముగిసిన తర్వాత కూడా స్వీకరించే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. తుది ఓటర్ల జాబితా సిద్ధమయ్యే వరకు అర్హులైనవారు తమ వివరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంది. ఈ ప్రక్రియపై ప్రజలకు అర్థమయ్యే భాషలో విస్తృత అవగాహన కల్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ 28న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 1కు, అక్టోబర్ 30న నిర్వహించాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 3కు మార్చింది. దీంతో నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఒకే రోజు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది అందుబాటును దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల తేదీలను సవరించినట్లు సమాచారం. **తాజా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 6న అవసరమైన చోట రీపోలింగ్ చేపట్టనున్నారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు. ఎన్నికల తేదీల మార్పుతో అధికారులు ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు అవకాశం కలగనుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సవరించిన షెడ్యూల్‌కు అనుగుణంగా తమ ఎన్నికల కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీకి వెళ్లి నిరసనను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు. **దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం ఎదుట ధర్నా** ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు. ఇందుకు నిరాకరించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు మెరుపు ధర్నా చేపట్టారు. మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **బస్సుల్లో ఢిల్లీకి తరలింపు** ప్రత్యేక రైళ్ల కోసం ఆరు రోజుల ముందే దరఖాస్తు చేసినప్పటికీ చివరి నిమిషంలో తిరస్కరించారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్తారని తెలిపారు. ఇందుకోసం అవసరమైన బస్సులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే నిరసనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

- పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

హైదరాబాద్, అక్టోబర్ 28 : అర్నాబ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి పంట నేలకొరగగా, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సరాసరి 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో పరిస్థితిని సమీక్షించి ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా, ఖమ్మం జిల్లాలో పరిస్థితులను బట్టి సెలవులు ప్రకటించాలని అధికారులు ఆదేశించారు. గోదావరి పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తత పెంచి సహాయక బృందాలను సిద్ధంగా ఉంచారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విద్యుత్ తీగలు, పాత గోడలు, పెద్ద చెట్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. పంట నష్టానికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

హైదరాబాద్, అక్టోబర్ 28 : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఏఐ సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకొని ప్రభుత్వ పనులను వేగవంతం చేయడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల గుర్తింపు, నివేదికల తయారీ, సమాచార విశ్లేషణ, ప్రజల సమస్యల పరిష్కారం వంటి పనుల్లో కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల దరఖాస్తులు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారులకు అవసరమైన సమాచారం సులభంగా అందడం వంటి ప్రయోజనాలు ప్రజలకు కలగాలని పేర్కొన్నారు.

విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడం, పరికరాల్లో లోపాలను ముందుగానే గుర్తించడం, అభివృద్ధి పనుల్లో జాప్యానికి కారణాలను విశ్లేషించడం వంటి అంశాల్లోనూ ఏఐని వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే ఏఐ సాధనాలను ఉపయోగించేటప్పుడు సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏఐ ద్వారా లభించిన సమాచారాన్ని అధికారికంగా వినియోగించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, తొలుత ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాల ఆధారంగా విస్తరించాలని భట్టి విక్రమార్క కోరారు.

రైతులకు అండగా సీసీఐ కొనుగోలు కేంద్రం.. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి

- ఉప్పరపల్లిలో రీ సర్వేపై గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్
- ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం.. చిన్నారికి అక్షరాభ్యాసం చేయించిన ఎమ్మెల్యే

చింతపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య: చింతపల్లి రైతుల సంక్షేమం, భూ సమస్యల పరిష్కారం, పేదలకు సొంతింటి కల సాకారం, చిన్నారులకు విద్యాబాట చూపడమే లక్ష్యంగా వివిధ కార్యక్రమాల్లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ శివ సాయి కాటన్ జిన్నింగ్ మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు దళారులపై ఆధారపడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పత్తిని శుభ్రంగా, తేమ శాతం తగ్గించి తీసుకురావాలని, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పత్తిని విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రంలో ప్రదర్శించిన ధరల పట్టిక ప్రకారం, పత్తి రకాన్ని బట్టి క్వింటాలుకు రూ.8,567 నుంచి రూ.8,667 వరకు ధరలు ఉన్నాయి. తుది ధర పత్తి నాణ్యత, తేమ శాతం, వర్తించే నిబంధనల ఆధారంగా నిర్ణయించబడుతుందని తెలిపారు.

భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

అనంతరం చింతపల్లి మండలం ఉప్పరపల్లి గ్రామంలో భూముల రీ సర్వేపై నిర్వహించిన అవగాహన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దశాబ్దాలుగా ఉన్న భూ రికార్డుల వ్యత్యాసాలు, సరిహద్దు వివాదాల పరిష్కారానికి రికార్డుల పరిశీలన, సర్వే ఎంతో కీలకమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న భూ భారతి చట్టం ద్వారా భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హత, నిబంధనల మేరకు భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించి LPM (ల్యాండ్ పార్సెల్ మ్యాప్) నంబర్ల కేటాయింపు ప్రక్రియ చేపడతారని వివరించారు. రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను సిద్ధంగా ఉంచుకొని సర్వే అధికారులకు సహకరించాలని సూచించారు.

పేదల సొంతింటి కల సాకారం.. ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు

ఉప్పరపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సొంత ఇల్లు పేద కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవాన్ని అందిస్తుందని, అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

చిన్నారికి అక్షరాభ్యాసం.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి

ఎమ్మెల్యే బాలు నాయక్ అక్షరాభ్యాసం చేయించారు. బాల్యంలోనే విద్యపై ఆసక్తి పెంపొందించడం ద్వారా పిల్లల భవిష్యత్తుకు పునాది వేయవచ్చని అన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, మెరుగైన సంరక్షణ అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులతో పాటు దొంతం సంజీవరెడ్డి, జాటావత్ హరినాయక్, కొండూరు పవన్ కుమార్, ఎరుకల వెంకటయ్య గౌడ్, ముచ్చర్ల గిరి, అంగిరేకుల నాగభూషణం, జంగిటి నర్సింహ యాదవ్, చింతలపూడి భాస్కర్ రెడ్డి, కాసారపు శ్రీను, మెండె వెంకట్ యాదవ్, కాయితి రామకృష్ణ రెడ్డి, వాంకుడోత్ రవి నాయక్, కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, యాచారం యాదిగౌడ్, అంగిరేకుల గోవర్ధన్, గుణమోని కొండల్ యాదవ్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, రైతులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

భానూరు అభివృద్ధికి ఎంపీ భరోసా

- ఎనిమిదో వార్డులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

పటాన్‌చెరు: భానూరు గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు భరోసా ఇచ్చారు. గ్రామంలోని ఎనిమిదో వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఎంపీకి గజమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. భానూరు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని ఎంపీ తెలిపారు. మహిళా సమైక్య భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. సీసీ రోడ్డు నిర్మాణంతో ఎనిమిదో వార్డు ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడనుంది.

కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వాసుదేవ్ కన్నాకు జన్మదిన శుభాకాంక్షలు

- సిరన్నగారి శ్రీకాంత్ రెడ్డి అభినందనలు.. ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్ష
- పార్టీ బలోపేతానికి, సామాజిక సేవకు వాసుదేవ్ కన్నా కృషి అభినందనీయం

భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 28 । చేవెళ్ల నియోజకవర్గం : రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సామాజిక సేవకుడు వాసుదేవ్ కన్నాకు బీఆర్ఎస్ నాయకుడు సిరన్నగారి శ్రీకాంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుదేవ్ కన్నా ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో నిబద్ధతతో పనిచేస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సత్సంబంధాలు కొనసాగించడం, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం నాయకుడికి అవసరమైన లక్షణాలని పేర్కొన్నారు. సామాజిక సేవ పట్ల ఆసక్తి చూపుతూ ప్రజలతో మమేకమయ్యే నాయకులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. వాసుదేవ్ కన్నా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల అభిమానాన్ని పొందాలని, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి కొనసాగించాలని శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. జన్మదినం సందర్భంగా వాసుదేవ్ కన్నాకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయనకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకున్నారు.

ఓటు చోరీ నిరసనకు కల్వకుర్తి నుంచి భారీగా తరలింపు

- రైళ్లు ఆపితే.. బస్సుల్లో ఢిల్లీకి వెళ్తాం
- నవంబర్ 1న ఢిల్లీలో మహా నిరసన.. గరుడ, వోల్వో బస్సుల ఏర్పాట్లు
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం ఆగదు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన, కల్వకుర్తి నియోజకవర్గం: ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే లక్ష్యంగా నవంబర్ 1న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న మహా నిరసన కార్యక్రమానికి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఓటరు జాబితాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న నిరసనలో భాగంగా ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం రైళ్లు కేటాయించలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. రైళ్ల సౌకర్యం లేకపోయినా వెనక్కి తగ్గకుండా ప్రత్యామ్నాయంగా గరుడ, వోల్వో బస్సులను ఏర్పాటు చేసి పార్టీ నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలను ఢిల్లీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట కాంగ్రెస్ నిరసన

ఢిల్లీలో నవంబర్ 1న తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు రైళ్లు కేటాయించాలన్న అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులు కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవడంతో అక్కడ తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ కిందపడినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఓటు హక్కు పరిరక్షణ కోసం చేపట్టిన నిరసనకు రవాణా సౌకర్యాల విషయంలో ఆటంకాలు ఎదురైనా తమ ఆందోళన కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

కల్వకుర్తి నుంచి భారీగా జన సమీకరణ

ఢిల్లీలో నిర్వహించనున్న మహా నిరసనలో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలను సమన్వయం చేసుకుంటూ ప్రయాణ ఏర్పాట్లు చేపడుతున్నారు. రైళ్ల ద్వారా ప్రయాణించే అవకాశం లేకపోవడంతో గరుడ, వోల్వో బస్సులను సిద్ధం చేసి వందలాది మందిని ఢిల్లీకి తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు విలువ ఉంటుందని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఉండటం అత్యంత ముఖ్యమని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. ఓటరు జాబితాల నిర్వహణ, ఓటు హక్కు పరిరక్షణ వంటి అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని, ఈ అంశాలపై తమ నిరసనను ఢిల్లీ వేదికగా తెలియజేస్తామని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో

కల్వకుర్తి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లేలా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

"రైళ్లు ఇవ్వకపోతే బస్సుల్లో ఢిల్లీకి వెళ్తాం"

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. "ఓటు చోరీకి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పోరాటాన్ని అడ్డుకోవాలని బీజేపీ చూస్తోంది. రైళ్లు ఇవ్వకపోతే మా ప్రయాణం ఆగిపోతుందనుకోవడం పొరపాటు. రైళ్లకు బదులుగా గరుడ, వోల్వో బస్సుల్లో ఢిల్లీకి వెళ్లి ఓటు చోరీ అంశాన్ని దేశం దృష్టికి తీసుకెళ్తాం. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, ప్రజలను భారీగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. ఆ హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఈ పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం

ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడాలంటే ఓటరు జాబితాల పారదర్శకత, ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందుబాటులో ఉండటం కీలకమని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. ఈ అంశాలపై తమ అభ్యంతరాలను నిరసన ద్వారా తెలియజేసేందుకు ఢిల్లీకి వెళ్తున్నట్లు వెల్లడించారు. రవాణా ఏర్పాట్లలో ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ కల్వకుర్తి నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

గడ్డం నాగయ్య దశదిన కర్మలో పాల్గొన్న BRS నేత కొత్తపల్లిలో BRS నాయకుల నివాళి



- గడ్డం నాగయ్యకు ఘన నివాళులు
- గడ్డం నాగయ్య కుటుంబాన్ని పరామర్శించిన దేవరకొండ BRS నేత వడ్త్య రమేష్

నేరేడుగొమ్ము భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య నేరడిగొమ్ము అక్టోబర్ 29: దేవరకొండ నియోజకవర్గం నేరేడుగొమ్ము మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన BRS పార్టీ నాయకులు గడ్డం రమేష్ గారి తండ్రి గడ్డం నాగయ్య గారు ఇటీవల స్వర్గస్థులైన విషయం తెలిసిందే. వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన దశదిన కర్మ కార్యక్రమంలో BRS పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ గారు పాల్గొని ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గడ్డం నాగయ్య గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట దీ=షా పార్టీ మాజీ మండల అధ్యక్షుడు లోకసాని తిరుపతన్న, కేతావత్ పులిసింగ్ నాయక్, గడ్డం రమేష్, అనిల్, నేనావత్ నరసింహ నాయక్, రాజు తదితరులు ఉన్నారు.

420 హామీలిచ్చి ప్రజలకు ముఖం చాటేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- వెయ్యి రోజులైనా హామీల అమలు ఏది?
- 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు

దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వెయ్యి రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నేరడుగొమ్ము మండలం కచారాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బీచ్య నాయక్ తండాకు చెందిన పలువురు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ముఖం చాటేస్తున్నారని ఆయన అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం, వ్యవసాయం, విద్యుత్, తాగునీరు వంటి రంగాల్లో తెలంగాణ గణనీయమైన అభివృద్ధి సాధించిందని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు కరెంటు కోతలు, నీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రతి ఇంట్లో ఇన్వర్టర్లు, అపార్ట్‌మెంట్లలో జనరేటర్లు తప్పనిసరిగా ఉండే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని

బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్, తాగునీరు సహా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఆసరా పెన్షన్లను రూ.2,000 నుంచి రూ.4,000కు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఆ హామీని ఎందుకు అమలు చేయడం లేదని రవీంద్ర కుమార్ ప్రశ్నించారు. రైతులకు ఎకరానికి రూ.10,000కు బదులుగా రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులకు ఇచ్చిన హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతోందని విమర్శించారు. అమాయక రైతులకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని అన్నారు. రైతులు, పేదలు, వృద్ధులు తమ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలు తమ సమస్యలను ప్రస్తావించినప్పుడు, ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాల్సింది పోయి విమర్శలకు తిట్లతో బదులిస్తున్నారని రవీంద్ర కుమార్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత మాత్రమే కాదని, అది ప్రజల హక్కు కూడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఒక్కొక్కటిగా వివాదాలు, అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం రాహుల్ గాంధీకి ఏటీఎంగా మారిందని, రాష్ట్ర వనరులను రాజకీయ అవసరాల కోసం వినియోగిస్తున్నారంటూ ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరంతరం ప్రజల తరఫున పోరాటం చేస్తుందని రవీంద్ర కుమార్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. రాబోయే ఏడాదిన్నర కాలంలోనే బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ఆయన నాయకత్వంలో తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తుందని రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వడత్య బాలు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నా బిడ్డ పెళ్లికి రండి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వైఎస్ షర్మిల ఆహ్వానం

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దంపతులను ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల దంపతులు బుధవారం హైదరాబాద్‌లోని 'ప్రజాభవన్'లో కలిశారు. ఈ సందర్భంగా తమ కుమార్తె వివాహానికి తప్పక హాజరుకావాలని కోరుతూ వారికి పెళ్లి శుభలేఖను అందజేసి, ఆత్మీయంగా ఆహ్వానించారు.

పాత్రికేయులు లేని సమాజం చీకటిమయం

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం
- ఘనంగా ఐఎఫ్ డబ్ల్యూజే 76 వ వ్యవస్థాపక వేడుకలు

హైదరాబాద్, అక్టోబర్ 28: మనిషికి ప్రాణవాయువు ఎలాగో... సమాజానికి జర్నలిజం, జర్నలిస్టులు కూడా అలాగే అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. సూర్యుడు లేని సమాజం ఏ విధంగా ఉంటుందో జర్నలిస్టులు లేని సమాజం కూడా అదే విధంగా ఉంటుందని అన్నారు. జర్నలిస్టులు సమాజానికి దిశా నిర్దేశం చేసే వారని, అటువంటి జర్నలిస్టులు నేడు అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల త్యాగరాయ గాన సభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురు సీనియర్ పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తం మాట్లాడుతూ, పాత్రికేయులు సమాజానికి వెలుతురులాంటి వారని, పాత్రికేయులే లేకపోతే సమాజం చీకటిమయమవు తుందని అన్నారు. ఒకప్పుడు పత్రికలు, పాత్రికేయులంటే సమాజానికి, ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేసే స్థాయిలో ఉండేదని, కానీ ప్రస్తుతం రాజకీయ నాయకులు, పాలకులు జర్నలిస్టులను పావులుగా వాడుకుంటున్నారే తప్ప జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయమై చాలా నిర్లక్ష్యం చేశాయని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం సుముఖంగా ఉన్నారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తనవంతు బాధ్యతగా అన్ని విధాలుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని న్నారు. మీడియా సంస్థలు, విద్యా, వైద్య సంస్థలు చదువుకున్న వారి చేతిలో లేవని, కేవలం పెట్టుబడిదారుల చేతుల్లో మాత్రమే ఉన్నాయని, అందుకే సమాజంలో ఇటు పత్రికలకు అటు జర్నలిస్టులకు విలువలు లేకుండా పోయాయని విమర్శించారు. గతంలో పత్రికలు నిజాలు మాత్రమే రాసేవని, పత్రికలో అగ్గిపెట్టెంత వార్త వస్తే ఎంతో స్పందన వచ్చేదని, ప్రస్తుతం నిజాలు రాసే పత్రికలు కరువయ్యాయని అన్నారు. సమాజం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు సంక్షేమ ప్రయోజనాలు సమకూర్చకపోవడం దారుణమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్క రంగానికి ఏదో ఒక లబ్ధి చేకూరుస్తున్న ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించడం చాలా బాధాకరమని అన్నారు. నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడంలో ముందున్న జర్నలిస్టులు తమ సమస్యలను తాము పరిష్కరించుకోవడంలో విఫలమవుతు న్నారని అన్నారు. జర్నలిస్టులకు భూముల్లేవు, జాగలు లేవు, హెల్త్ కార్డులు లేవు, సంక్షేమ పథకాలు లేవని అన్నారు. ప్రతి ఒక్క జర్నలిస్టు సంఘటితంగా తమ యూనియన్ల హయాంలో ఉద్యమించి హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొఫెసర్‌గా తనకు జర్నలిస్టులతో విడదీయరాని అనుబంధం ఉందని, తెలంగాణ ఉద్యమ సమయం లో సైతం జర్నలిస్టులతో కలిసి పోరాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, అందుకే జర్నలిస్టుల కష్ట సుఖాలు తనకు తెలుసని ప్రొఫెసర్ పురుషోత్తం అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ 76వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులను సన్మానించడం అభినందనీయమని, ఇది సమాజంలో మంచి సాంప్రదాయమని అన్నారు. సమాజానికి విశిష్ట సేవలందించిన సీనియర్ పాత్రికేయులను మర్చిపోకుండా గౌరవించుకోవాలని, ఈ సాంప్రదాయం ఇకముందు కూడా ఇలాగే కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య మాట్లాడుతూ, దేశంలో జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక మొదటి యూనియన్ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అని అన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం సాధన కై దేశవ్యాప్తంగా పోరాడుతుందని, అదేవిధంగా రిటైర్డ్ పాత్రికేయుల కోసం జాతీయ పెన్షన్ పథకం,జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు కోసం ఉద్యమిస్తుందని అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘానికి అనుబంధంగా ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బలోపేతమై త్వరలో జర్నలిస్టుల సమస్యలపై కార్యాచరణ ప్రకటిస్తుందని మామిడి సోమయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు టి. ఉదయవర్లు, నందిరాజు రాధాకృష్ణ, అద్దంకి శ్రీరామ కుమార్, సిబి లక్ష్మి, యర్రమిల్లి రామారావు తదితరులను ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవి కుమార్, కో- కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, రాష్ట్ర నాయకులు పి.ఆనందం, కె.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో ఎల్ నినోపై అవగాహన సదస్సు ఎల్ నినో ప్రభావం

- నివారణ చర్యలపై విద్యార్థినులకు అవగాహన
- సర్పంచ్ రాంసింగ్ నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- ట్రైబల్ కళాశాలలో ఘనంగా ఎల్ నినో అవగాహన సదస్సు - పాల్గొన్న అధికారులు

దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్ద్య : దేవరకొండ మండలంలోని మైనంపల్లి వద్ద ఉన్న తెలంగాణ ప్రభుత్వ మహిళా గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో నేడు సర్పంచ్ రాంసింగ్ నాయక్ గారి ఆధ్వర్యంలో "ఎల్ నినో ప్రభావం – నివారణ చర్యలు" అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా RCO శ్రీనివాస రాయ్, MPDO పార్వతి, RWS DE నగేష్, AE హుస్సేన్, AEO అభిలాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రియ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ఎల్ నినో అంటే ఏమిటి? వాతావరణంలో దాని ప్రభావం ఎలా ఉంటుంది? దాని వల్ల వర్షాభావం, కరువు, పంటల దిగుబడి తగ్గడం, నీటి ఎద్దడి వంటి సమస్యలు ఎలా వస్తాయో విద్యార్థినులకు వివరంగా తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి పొదుపు, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, చెట్ల పెంపకం వంటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు వాతావరణ మార్పులపై అవగాహన పెంచుకోవడంతో పాటు, తమ గ్రామాల్లో కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచ్ రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గిరిజన విద్యార్థినుల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొర్ర కిషన్, వెంకట్, ప్రశాంత్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బంజారాహిల్స్ డివిజన్ నాయకులకు మన్నె గోవర్ధన్‌రెడ్డి పిలుపు

మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి సూచించారు. తెలంగాణ భవన్‌లో ఆయన అధ్యక్షతన బుధవారం బంజారాహిల్స్ డివిజన్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టభద్రుల ఓటరు నమోదు గడువు సమీపిస్తున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. డివిజన్ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అర్హులైన పట్టభద్రులను గుర్తించి, దరఖాస్తులు అందేలా చూడాలన్నారు. నమోదును అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని దిశానిర్దేశం చేశారు.

పట్టభద్రుల ఓటరు నమోదును విజయవంతం చేయాలి

- అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి
- గ్రామాలు, వార్డుల వారీగా బాధ్యతలు తీసుకొని నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి
- నాయకులకు దిశానిర్దేశం చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన, కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, ఎవరూ తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో గోలి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ఆయన దిశానిర్దేశం చేశారు. కల్వకుర్తి పట్టణంతో పాటు కల్వకుర్తి, వెల్దండ మండలాల పరిధిలోని గ్రామాలు, వార్డుల వారీగా నాయకులు బాధ్యతలు తీసుకొని నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కుపై అవగాహన

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు కీలకమైన అంశమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు చొరవ తీసుకోవాలని గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పట్టభద్రులను నేరుగా కలవాలని సూచించారు. ఓటరు నమోదుకు అవసరమైన వివరాలు, అనుసరించాల్సిన విధానం గురించి వారికి స్పష్టంగా వివరించాలని తెలిపారు. ముఖ్యంగా యువ పట్టభద్రులు, ఉద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న విద్యావంతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు.

గ్రామాలు, వార్డుల వారీగా బాధ్యతలు

కల్వకుర్తి పట్టణంలోని వార్డులతో పాటు కల్వకుర్తి, వెల్దండ మండలాల్లోని ప్రతి

గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించాలని సమావేశంలో సూచించారు. పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పరస్పర సహకారంతో పనిచేస్తూ అర్హులైన పట్టభద్రులను గుర్తించాలని తెలిపారు. నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేస్తూ, అవసరమైన సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ఆశించిన స్థాయిలో నమోదు కార్యక్రమం ముందుకు సాగుతుందని అన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే లక్ష్యం సాధ్యం

ఓటరు నమోదు కార్యక్రమం విజయవంతం కావడానికి నాయకుల మధ్య సమన్వయం అత్యంత అవసరమని గోలి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలను కలవాలని, అర్హులైన పట్టభద్రులు నమోదు ప్రక్రియకు దూరంగా ఉండకుండా చూడాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించడంతో పాటు, నమోదు ప్రక్రియకు సంబంధించిన నిబంధనలను కూడా తెలియజేయాలన్నారు. బాధ్యతలు తీసుకున్న నాయకులు తమ పరిధిలోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఇన్‌చార్జి రజిని సాయి చందు హాజరు

ఈ సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్సీ ఇన్‌చార్జి రజిని సాయి చందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం కూడా పాల్గొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు నాయకులు తీసుకోవాల్సిన చర్యలు, గ్రామాలు, వార్డుల వారీగా సమన్వయం చేసుకోవాల్సిన అంశాలపై సమావేశంలో చర్చించారు. పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని పట్టభద్రులకు సమాచారం చేరవేస్తూ నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పలువురు ప్రజాప్రతినిధులు, నాయకుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు దశరథ్ నాయక్, విజిత రెడ్డి, వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సాహెద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య, కాటన్ మిల్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, కౌన్సిలర్ రాములు, మాజీ సర్పంచ్ సుశీల ఈశ్వర్, మాజీ సర్పంచులు జంగయ్య, అంజి నాయక్, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్ పాల్గొన్నారు. అలాగే జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జోగయ్య, కొమ్ము శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ హన్మంత్ నాయక్, ఏలికల్ సర్పంచ్ కృష్ణయ్య, తోటపల్లి సర్పంచ్ సత్యనారాయణ, వెంకటాపూర్ సర్పంచ్ రాజు, వేపూర్ సర్పంచ్ నాగరాజు, అజిలాపూర్ సర్పంచ్ రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు శోభ, శేఖర్ రెడ్డి, జ్యోతినిరంజన్, మాజీ కౌన్సిలర్ తాహిర్ అలీ, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు రుక్నుద్దీన్, వార్డు సభ్యులు ముత్యాల నరేష్, కిషోర్, సునీత ఆనంద్‌తో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టభద్రులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల భాగస్వామ్యమే కీలకం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అర్హులైన ఓటర్లు భాగస్వాములు కావాలంటే ముందుగా ఓటరు నమోదు పూర్తిచేసుకోవడం అవసరమని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని నిర్ణయించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతుల మెడకు ఉచ్చు బిగిస్తున్న కాంగ్రెస్!

- డిక్లరేషన్ పేరుతో కొత్త డ్రామా.. మన్నె గోవర్ధన్‌రెడ్డి

రైతులకు నీళ్లు, కరెంటు ఇవ్వలేని ప్రభుత్వం.. డిక్లరేషన్ల పేరుతో రైతులపైనే బాధ్యతలు మోపడం సిగ్గుచేటు. ఎన్నికల ముందు రైతులపై ప్రేమ ఒలకబోసిన కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వచ్చాక వారినే ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. రైతులకు సాగునీరు అందించలేని, నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయలేని, పంటలకు భరోసా కల్పించలేని ప్రభుత్వం.. రైతులతో డిక్లరేషన్లు రాయించుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలకు రైతులు ఎందుకు బాధ్యత వహించాలని నిలదీశారు.

ప్రభుత్వ బాధ్యతను రైతులపైకి నెట్టడమేనా?

రైతులకు నీళ్లు ఇవ్వడం, నిరంతర విద్యుత్తు సరఫరా చేయడం, పంటలకు గిట్టుబాటు ధరతోపాటు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకుండా డిక్లరేషన్ల పేరుతో రైతుల మెడకు బాధ్యతల ఉచ్చు బిగించడం అన్యాయమన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకోకుండా వారిపై ఆంక్షలు విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ముందు హామీలు అమలు చేయాలి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు డిక్లరేషన్, బాండ్ పేపర్లపై చేసిన హామీలను ముందుగా అమలు చేయాలని మన్నె గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డిక్లరేషన్ల పేరుతో తీసుకుంటున్న నిర్ణయాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతులను బలహీనులుగా చూడొద్దని, వారి సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులపైనే బాధ్యతలు మోపడం ప్రజాపాలన ఎలా అవుతుందని ప్రశ్నించారు. రైతుల సంక్షేమమే లక్ష్యమైతే ముందుగా ఎన్నికల హామీలను అమలు చేసి, వ్యవసాయ రంగానికి అవసరమైన నీరు, విద్యుత్తు, పంట భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

చందంపేట మండలంలో ఎమ్మెల్యే బాలు నాయక్ సుడిగాలి పర్యటన

- పలు అభివృద్ధి పనుల ప్రారంభం శంకుస్థాపనలు
- మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన
- మూడు ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు
- చందంపేటలో బాలు నాయక్ జోరు
- సీనియర్ నేత కీరు నాయక్ కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్
- దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

చందంపేట పర్యటనలో ఎమ్మెల్యే బాలు నాయక్

చందంపేట భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్ద్య : దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. బుధవారం చందంపేట మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేపట్టి పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గ్రామాల్లో వెలుగులు.. రహదారులకు మహర్దశ:

చిత్రియాల గ్రామంలోని కాటమయ్య గుడి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను, అనంతరం రేకులగడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. బుడ్డోనితండా గ్రామ పరిధిలోని వెంకట్ తండాలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

కీరు నాయక్‌కు నివాళులు:

యాపలపాయ తండా సర్పంచ్ మకట్ లాల్ తండ్రి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కీరు నాయక్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన:

మూడుదండ్ల గ్రామంలో మహిళా సమాఖ్య

భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తామని తెలిపారు.

మూడు ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు:

అదే గ్రామంలో మూడు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నెరవేరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో దొండేటి మల్లారెడ్డి, ఏడ్పుల గోవింద్ యాదవ్, జర్పుల భద్యా నాయక్, వాంకునావత్ బిక్కు నాయక్, మారుపాకుల సురేష్ గౌడ్, కిన్నెర హరికృష్ణ, తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాయపడిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళికకు పరామర్శ

- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆసుపత్రికి వెళ్లిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి
- కొత్తపేట సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రవళిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా

మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని: బస్సు నుంచి తోసివేయడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ప్రవళికను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి పరామర్శించారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేటలో ఉన్న సాయి సంజీవని ఆసుపత్రికి వెళ్లిన వారు ప్రవళిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమెకు అందుతున్న వైద్య చికిత్స వివరాలను తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆసుపత్రిలో వైద్య చికిత్సపై ఆరా

మణుగూరు డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవళిక ఇటీవల బస్సు నుంచి తోసివేయబడటంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. ఈ ఘటన అనంతరం ఆమెను కొత్తపేటలోని సాయి సంజీవని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. వైద్యులను అడిగి చికిత్సకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ప్రవళిక ఆరోగ్యం మెరుగుపడేందుకు అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయా అనే విషయంపై ఆరా తీశారు.

ఆర్టీసీ సిబ్బందికి అండగా..

ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ఆర్టీసీ సిబ్బంది విధి నిర్వహణలో ఎదుర్కొనే ఇబ్బందులు, భద్రతకు సంబంధించిన అంశాలు ప్రాధాన్యత కలిగి ఉంటాయి. విధుల్లో ఉన్న కండక్టర్ ప్రవళిక గాయపడటంతో ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం, కుటుంబానికి ధైర్యం చెప్పడం కోసం నాయకులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆమె త్వరగా కోలుకొని ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

ప్రవళికకు అందుతున్న వైద్య సేవలపై మంత్రి పొన్నం ప్రభాకర్, జక్కిడి శివ చరణ్ రెడ్డి వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందడం, ఆమె ఆరోగ్యం కుదుటపడటం ప్రస్తుతం ముఖ్యమని ఈ పరామర్శ సందర్భంగా ప్రాధాన్యత సంతరించుకుంది. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల భద్రత, వారి సంక్షేమంపై తగిన శ్రద్ధ అవసరమనే అంశాన్ని ఈ ఘటన మరోసారి ముందుకు తెచ్చింది. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, బాధితులకు ధైర్యం చెప్పడం మన బాధ్యత. ప్రవళిక త్వరగా కోలుకొని ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నాం" అనే సందేశంతో ఆమెను పరామర్శించారు.

ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు పర్వేదలో ముందస్తు చర్యలు

- నీటి సంరక్షణ పనుల్లో పర్వేద ముందంజ.. సర్పంచ్ సురేందర్ గౌడ్‌ను అభినందించిన మంత్రి సీతక్క

భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । 28-10-2026 । చేవెళ్ల నియోజకవర్గం : ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పర్వేద గ్రామ పంచాయతీలో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ సురేందర్ గౌడ్ తెలిపారు. గ్రామంలో వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాలను పెంపొందించడం లక్ష్యంగా ఇంకుడు గుంతలు, డ్రైనేజీ సోక్‌పిట్లు, ఫామ్ పాండ్లు వంటి నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపడుతున్నట్లు వివరించారు. బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పర్వేద గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నీటి సంరక్షణ పనుల పురోగతిపై సర్పంచ్‌ను అడిగి తెలుసుకున్నారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ గ్రామంలో చేపడుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి సీతక్క, సురేందర్ గౌడ్ చొరవను అభినందించారు. పర్వేద గ్రామం నీటి సంరక్షణలో ఇతర గ్రామాలకు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు నిధుల వినియోగంలో సౌలభ్యం కల్పించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్కతో పాటు స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ కమిషనర్ దివ్య దేవరాజన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. వీడియో, టెలీకాన్ఫరెన్స్‌ల ద్వారా గ్రామాల అభివృద్ధి, ఉపాధి హామీ, పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతులపై అధికారులకు మార్గదర్శకత్వం అందిస్తున్నందుకు మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో ప్రతి నీటి చుక్కను సంరక్షిస్తూ, భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా పర్వేదను నీటి సంరక్షణలో ఆదర్శ గ్రామంగా

తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ సురేందర్ గౌడ్ వెల్లడించారు.

మైనంపల్లి గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో ఎల్ నినోపై అవగాహన సదస్సు ఎల్ నినో ప్రభావం

- నివారణ చర్యలపై విద్యార్థినులకు అవగాహన - సర్పంచ్ రాంసింగ్ నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- ట్రైబల్ కళాశాలలో ఘనంగా ఎల్ నినో అవగాహన సదస్సు - పాల్గొన్న అధికారులు

దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్ద్య : దేవరకొండ మండలంలోని మైనంపల్లి వద్ద ఉన్న తెలంగాణ ప్రభుత్వ మహిళా గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో నేడు సర్పంచ్ రాంసింగ్ నాయక్ గారి ఆధ్వర్యంలో "ఎల్ నినో ప్రభావం – నివారణ చర్యలు" అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా RCO శ్రీనివాస రాయ్, MPDO పార్వతి, RCO DE నగేష్, AE హుస్సేన్, AEO అభిలాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రియ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ఎల్ నినో అంటే ఏమిటి? వాతావరణంలో దాని ప్రభావం ఎలా ఉంటుంది? దాని వల్ల వర్షాభావం, కరువు, పంటల దిగుబడి తగ్గడం, నీటి ఎద్దడి వంటి సమస్యలు ఎలా వస్తాయో విద్యార్థినులకు వివరంగా తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి పొదుపు, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, చెట్ల పెంపకం వంటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు వాతావరణ మార్పులపై అవగాహన పెంచుకోవడంతో పాటు, తమ గ్రామాల్లో కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచ్ రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గిరిజన విద్యార్థినుల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొర్ర కిషన్, వెంకట్, ప్రశాంత్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వే జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ మెరుపు ధర్నా

- ప్రత్యేక రైళ్లు కేటాయించలేదని ఆగ్రహం.. టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రి సహా పలువురి అరెస్ట్

హైదరాబాద్: ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమానికి తెలంగాణ నుంచి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరినా దక్షిణ మధ్య రైల్వే నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద నిరసన కొనసాగించడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమానికి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు వీలుగా హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు రైల్వే శాఖను కోరారు. అయితే ఈ విషయంలో అనుకూల స్పందన రాకపోవడంతో రైల్వే జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఎంపీ రఘురామ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి ప్రత్యేక రైళ్లు కేటాయించకుండా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రైల్వే స్టేషన్ వద్ద కూడా నాయకులు నిరసన కొనసాగించడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో మహేష్ కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్, వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీగణేశ్‌తో పాటు పలువురు ముఖ్యనాయకులను అదుపులోకి తీసుకున్నారు.

పర్వేదలో జలసిరి పనులకు ప్రశంసలు

- రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో సర్పంచ్ సురేందర్ గౌడ్‌ను అభినందించిన మంత్రి సీతక్క
- జలసిరి పనుల్లో ముందున్న గ్రామాలకు అదనపు నిధులు కేటాయిస్తామని వెల్లడి

భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 28 । చేవెళ్ల నియోజకవర్గం : శంకర్‌పల్లి మండలంలోని పర్వేద గ్రామ పంచాయతీ పరిధిలో జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న నీటి సంరక్షణ పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ పర్యవేక్షించారు. సర్పంచ్ సురేందర్ గౌడ్ జలసిరి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నారని తెలిపారు. గ్రామంలో జరుగుతున్న పనుల వివరాలను జిల్లా అధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి సర్పంచుల వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, పంచాయతీరాజ్ కమిషనర్ పర్వేద గ్రామంలో చేపడుతున్న పనులను ప్రశంసిస్తూ సర్పంచ్ సురేందర్ గౌడ్‌ను అభినందించారు. మండలంలోని ఇతర గ్రామాల సర్పంచులు కూడా ఇదే విధంగా జలసిరి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జలసిరి కార్యక్రమంలో ఎక్కువ పనులు చేపట్టి పురోగతి సాధించిన గ్రామాలకు అదనపు నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి, భవిష్యత్తులో నీటి అవసరాలను తీర్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

దేవరకొండ నగర ABVP నూతన కార్యవర్గం ప్రకటన

- నగర కార్యదర్శిగా యలమల హేమేందర్ విద్యార్థులలో జాతీయవాదాన్ని పెంపొందించే ఏకైక సంస్థ ABVP
- రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చత్రపతి చౌహన్
- MKR డిగ్రీ కళాశాలలో ABVP నగర సమావేశం
- నూతన కార్యవర్గం ఎంపిక ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థాాదీవూ
- దేవరకొండలో నూతన కార్యవర్గం కొలువు

దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్ద్య: విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తూ విద్యార్థులలో జాతీయవాదాన్ని పెంపొందిస్తున్న ఏకైక సంస్థ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) అని ABVP రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చత్రపతి చౌహన్ అన్నారు. స్థానిక MKR ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన నగర సమావేశంలో దేవరకొండ నగర నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ABVP 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్సిటీలో నలుగురు విద్యార్థులతో ప్రారంభమై నేడు 78 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా నిలిచిందని, గత 78 సంవత్సరాలుగా జాతీయ పునర్నిర్మాణం కోసం పనిచేస్తోందని అన్నారు.

నూతన కార్యవర్గం వివరాలు:

నగర కార్యదర్శిగా యలమల హేమేందర్, ఉపాధ్యక్షులుగా యలమల హేమ సుందర్, గుండాల శివరామరాజు, సంజయ్ కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా స్వాతి, జె. హరీష్, బి. వినయ్, గర్ల్స్ కన్వీనర్‌గా పి. నేవ లతా, కో–కన్వీనర్‌గా కె. సుమూత, SFD కన్వీనర్‌గా తరుణ్, SFS కన్వీనర్‌గా శివకుమార్, స్పోర్ట్స్ కన్వీనర్‌గా ప్రశాంత్, కళామంచ్ కన్వీనర్‌గా ఎస్. వరలక్ష్మి, సోషల్ మీడియా కన్వీనర్‌గా అబ్దుల్లా, కార్యవర్గ సభ్యులుగా నందిని, సింధు, మంజుల, సరఫరాస్, జగదీష్, శివకుమార్ తదితరులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ాాదీవూ రాష్ట్ర హాస్టల్స్ కో–కన్వీనర్ యలమల గోపీచంద్, అమితేష్, హేమ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

జమాత్ ఎ ఇస్లామి హింద్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల ప్రదర్శన సెమినార్లు అక్టోబర్ 31 నుంచి 30 నుంచి నవంబర్ 1న వరకు ఎగ్జిబిషన్ గ్రౌండ్, నాంపల్లిలో నిర్వహించడం జరుగుతుందని సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ముబాసిర్ అహ్మద్ చెప్పారు

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్స్ పో 30 అక్టోబర్ సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు 31 అక్టోబర్ నంబరు 1 వరకు ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు సెక్రెటరీ ఇస్లామీ హి హిశీద్ కార్యదర్శి షరీఫ్ తాజుద్దీన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేవలం ఇస్లాం లేదా ముస్లిం గురించి మాత్రమే ఉన్న ప్రదర్శన కాదని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు సమాజమంతా ఒక పెద్ద ప్రశ్నపై ఆలోచించేందుకు ఇది ఆహ్వానం అపోహలు అపార్థాలు సమాచారం అనుమానం ద్వేషణ మాది ద్వేషం ప్రజలను విభజించడం ప్రారంభిస్తే సమాజంపై దాని ప్రభావం ఏమిటి అనే సమయాన్ని ఊహ ఊహలకు బదులుగా వాస్తవాలు దుమారానికి బదులుగా సంభాషణ పక్షపాతాన్ని బదులుగా అవగాహన పెంపొందించడం అంటే ఎలా సాధ్యం ఈ ఎక్స్పో ముందు ఉంచుతామని ఆయన చెప్పారు నిర్వహించే సెమినార్లో విద్యావేత్తలు జర్నలిస్టులు చరిత్రకారులు మత నాయకులు మేధావులు సామాజిక ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు ఈ కార్యక్రమం సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంటుందని యువత విద్యార్థులు విద్యావేత్తలు మేధావులు మీడియా కమ్యూనికేషన్ రంగాల చెందినవారు మాత సామాజిక కమ్యూనిటీ నాయకులు పౌర సమాజ సంస్థలు కుటుంబాలు సాధారణ ప్రజలను విస్తృతంగా భాగస్వామ్యం చేయడం మా లక్ష్యం అని ఆయన చెప్పారు కన్వీనర్ తారీకు మునీర్ మాట్లాడుతూ ఈ చక్కటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇందులో ఎలాంటి రుసుము లేదని ఆయన చెప్పారు.

శంకర్‌పల్లిలో విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ

- ఆసుపత్రి అత్యవసర హెచ్చరిక వ్యవస్థ నుంచి స్మార్ట్ డస్ట్‌బిన్ వరకు వినూత్న నమూనాల రూపకల్పన

భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 28 । చేవెళ్ల నియోజకవర్గం : శంకర్‌పల్లిలో టీజీఎంఎస్, సోహం అకాడమీ సహకారంతో నిర్వహించిన రోబోటిక్స్ శిబిరంలో 8వ, 9వ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడంతో పాటు సృజనాత్మక ఆలోచనలను ఆచరణలో పెట్టే లక్ష్యంతో విద్యార్థులు పలు వినూత్న నమూనాలను రూపొందించారు. ఆసుపత్రుల్లో అత్యవసర హెచ్చరిక వ్యవస్థ, పార్కులకు వచ్చే సందర్శకుల సంఖ్యను లెక్కించే కౌంటర్, రిమోట్‌తో గేట్లను తెరవడం, మూసివేయడం, గేట్ హెచ్చరిక వ్యవస్థ, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ, స్మార్ట్ డస్ట్‌బిన్ వంటి నమూనాలను తయారు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. రోబోటిక్స్, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానం అందించడంలో ఈ శిబిరం ఉపయోగపడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభా రాణి, అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) ఇన్‌చార్జ్ ఫరీదా బేగం, రోబోటిక్స్ మెంటర్ సతీష్ పాల్గొన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్యసిస్తూ నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

మలక్‌పేట నియోజకవర్గ అభివృద్ధికి కోటి రూపాయలతో ముందడుగు!

- **సైదాబాద్, ఓల్డ్ మలక్‌పేట, మూసారాంబాగ్ వార్డుల్లో నూతన డ్రైనేజీ లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం**
- **ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మార్గదర్శకత్వంలో ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం**
- **ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం.. కార్యక్రమంలో ఎండీ షఫీ, వివిధ శాఖల అధికారులు, స్థానికులు**

మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో: మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ప్రజలకు మెరుగైన రహదారులు, సమర్థవంతమైన మురుగునీటి పారుదల సదుపాయాలు కల్పించే లక్ష్యంతో సైదాబాద్, ఓల్డ్ మలక్‌పేట, మూసారాంబాగ్ వార్డుల్లో కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మార్గదర్శకత్వంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా ఈ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ), జీహెచ్‌ఎంసీ శాఖల ఆధ్వర్యంలో నూతన డ్రైనేజీ లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. స్థానిక ప్రాంతాల్లో ప్రజలకు ఎదురయ్యే మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించడంలో ఈ పనులు ఉపయోగపడనున్నాయి.

కాలనీల అభివృద్ధికి మౌలిక వసతులే కీలకం

వేగంగా విస్తరిస్తున్న నగర ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, పారిశుద్ధ్య సదుపాయాలు అత్యంత కీలకంగా మారుతున్నాయి. ముఖ్యంగా జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మురుగునీటి పారుదల సక్రమంగా ఉండటం, రహదారులు మెరుగ్గా ఉండటం ప్రజల రోజువారీ జీవనానికి ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో మలక్‌పేట నియోజకవర్గంలోని సైదాబాద్, ఓల్డ్ మలక్‌పేట, మూసారాంబాగ్ వార్డుల్లో కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. నూతన డ్రైనేజీ లైన్ల ఏర్పాటు ద్వారా మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా స్థానికంగా రాకపోకలకు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులను చేపట్టడం ద్వారా కాలనీల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అవకాశం ఏర్పడనుంది.

సీసీ రోడ్ల నిర్మాణంతో రాకపోకలకు సౌకర్యం

కాలనీల్లో రహదారులు సక్రమంగా ఉండటం ప్రజల రోజువారీ ప్రయాణాలకు ఎంతో అవసరం. రహదారుల పరిస్థితి మెరుగుపడితే స్థానిక నివాసితులతో పాటు వివిధ అవసరాల కోసం ఆయా ప్రాంతాలకు వచ్చే వారికి కూడా ప్రయోజనం కలుగుతుంది. ఈ నేపథ్యంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం, పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తిచేయడం కీలకం. నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. రహదారుల అభివృద్ధితో పాటు డ్రైనేజీ వ్యవస్థను సమన్వయంతో మెరుగుపరిస్తే స్థానిక ప్రాంతాల్లో మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు

నగర ప్రాంతాల్లో మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోతే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. అందువల్ల నూతన డ్రైనేజీ లైన్ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న వ్యవస్థల మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వడం అవసరం. సైదాబాద్, ఓల్డ్ మలక్‌పేట, మూసారాంబాగ్ వార్డుల్లో చేపట్టనున్న పనులు ఈ దిశగా ఉపయోగపడనున్నాయి. హెచ్‌ఎండబ్ల్యూఎస్–ఎస్‌బీ, జీహెచ్‌ఎంసీ శాఖల సమన్వయంతో పనులను చేపట్టడం ద్వారా స్థానిక అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది. పనుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవడం, నిర్మాణాలు పూర్తయిన తర్వాత నిర్వహణపై దృష్టి సారించడం కూడా అంతే ముఖ్యం.

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మార్గదర్శకత్వంలో కార్యక్రమం

ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మార్గదర్శకత్వంలో మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమానికి ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా హాజరయ్యారు. నియోజకవర్గంలోని వివిధ వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పనులకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఐఎం ఓల్డ్ మలక్‌పేట నాయకుడు ఎండీ షఫీ కూడా పాల్గొన్నారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదలకు సంబంధించిన అంశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి రావాలంటే ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం మరొకటి అనుసంధానమై ఉంటాయి. అందువల్ల పనుల ప్రణాళిక నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరించడం అవసరం. నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తయి, ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పుడే వాటి ప్రయోజనం పూర్తిస్థాయిలో లభిస్తుంది.

ప్రజలకు మెరుగైన సదుపాయాలే అభివృద్ధికి గుర్తింపు

ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండటం నగరాభివృద్ధిలో కీలకమైన అంశం. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, పారిశుద్ధ్య సదుపాయాలు మెరుగుపడితే స్థానిక నివాసితుల రోజువారీ జీవనానికి సౌలభ్యం కలుగుతుంది. ఈ

అవసరం.

వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యం

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ, జీహెచ్‌ఎంసీ, పారిశుద్ధ్య, ఉద్యానవన శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. స్థానిక నివాసితులు, ఎంఐఎం క్రియాశీల కార్యకర్తలు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు పాల్గొనడం ద్వారా అభివృద్ధి పనుల నిర్వహణలో శాఖల సమన్వయానికి ఉన్న ప్రాధాన్యత వెల్లడైంది. రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలు ఒకదానితో నేపథ్యంలో మలక్‌పేట నియోజకవర్గంలోని మూడు వార్డుల్లో కోటి రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. "ప్రజలకు మెరుగైన రహదారులు, సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి రావడమే నిజమైన అభివృద్ధికి గుర్తింపు. చేపట్టిన పనులు నాణ్యతతో పూర్తయి, స్థానిక ప్రజలకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూర్చాలి" అనే అభిప్రాయం ఈ కార్యక్రమం ద్వారా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్దలు అభిమానులు పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఏఐ పై అవగాహన పెంపొందించుకోవాలి

- **ప్రభుత్వ ఉద్యోగులు ఆధునిక సాంకేతికతలో అప్‌డేట్ కావాలి**
- **ఏఐతో ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలి**
- **కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు తిరిగి అందాలి**
- **'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంపొందించుకుని, తమ రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఏఐ శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ వినియోగం వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు వేగవంతం కావడంతోపాటు, సామాన్య ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలి. కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు మెరుగైన సేవల రూపంలో తిరిగి అందాలి. ప్రజల జీవితాల్లో కనిపించే సానుకూల మార్పే ఏఐ వినియోగానికి అసలైన గీటురాయి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ప్రణాళికా శాఖ సహకారంతో టీజీ మ్యాథ్ చేపట్టిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించి, పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. సాంకేతికతలో వస్తున్న మార్పులను ఉద్యోగులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీగా నిర్వహించే పనులను మరింత వేగంగా, సమర్థంగా పూర్తి చేసేందుకు ఏఐ సాధనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను గుర్తించడం, నివేదికలను రూపొందించడం, సమాచారాన్ని విశ్లేషించడం, ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరాలు అందించడం వంటి పనుల్లో ఏఐ ద్వారా సమయం ఆదా చేయవచ్చన్నారు. శిక్షణలో ఉద్యోగులు చురుగ్గా పాల్గొని, తమ విధులకు అనుగుణంగా ఏఐ సాధనాలను ఉపయోగించే పద్ధతులను నేర్చుకోవాలని కోరారు. ఒక రైతు దరఖాస్తు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారుడికి తనకు అందాల్సిన ప్రయోజనాలపై స్పష్టమైన సమాచారం లభించడం, ఒక పౌరుడు తన పని కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం తగ్గడం వంటి మార్పులు సాంకేతికత వినియోగం ద్వారా సాధ్యపడాలని పేర్కొన్నారు. ఉద్యోగులు ఆదా చేసిన సమయాన్ని ప్రజల సమస్యలను మరింత శ్రద్ధగా పరిశీలించేందుకు, సేవల నాణ్యతను పెంచేందుకు వినియోగించాలని సూచించారు.

ఆర్థిక, ప్రణాళికా రంగాల్లో మెరుగైన ఫలితాలు

ప్రజాధనం వినియోగాన్ని విశ్లేషించడం, ప్రాజెక్టుల వ్యయాలను పోల్చడం, పనుల అమలులో జాప్యాలకు కారణాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐ ఆధారిత సాధనాలు అధికారులకు సహాయపడగలవని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ వనరులను సమర్థంగా వినియోగించుకోవడానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలును మెరుగ్గా పర్యవేక్షించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రణాళికా రంగంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయో విశ్లేషించడం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారందరికీ చేరుతున్నాయా అనే అంశాలను పరిశీలించడం ద్వారా మెరుగైన ప్రణాళికలు రూపొందించవచ్చని తెలిపారు. గణాంకాలతోపాటు క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజల అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ రంగంలోనూ ఏఐతో ప్రయోజనాలు

విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేయడం, పరికరాల్లో తలెత్తే లోపాలను గుర్తించడం, నిర్వహణ చర్యలను మెరుగుపరచడం వంటి అంశాల్లో ఏఐ ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా విద్యుత్ నిర్వహణను మెరుగుపరిచి, రైతులు, పరిశ్రమలు, ఆసుపత్రులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఏఐ సాధనాలను ఉపయోగించే సమయంలో సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యమివ్వాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనుమతి లేని సాధనాల్లో అధికారిక లేదా వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయరాదన్నారు. ఏఐ రూపొందించిన సమాచారాన్ని అధికారిక రికార్డుల్లో చేర్చే ముందు, నిర్ణయాలకు ఆధారంగా ఉపయోగించే ముందు అధికారులు ధ్రువీకరించాలని సూచించారు. సాంకేతికత

సహాయంతో పనులు నిర్వహించినప్పటికీ తుది నిర్ణయాలు, వాటికి సంబంధించిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు.ప్రతి శాఖలో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, ముందుగా ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సూచించారు. ఫలితాలను పరిశీలించి, ప్రజలకు కలిగే ప్రయోజనం, పనితీరు, కచ్చితత్వం ఆధారంగా విస్తరణ చేపట్టాలని తెలిపారు.ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ శిక్షణను ప్రభుత్వ ఉద్యోగులందరూ ఒక అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతరం అవగాహన పెంపొందించుకుంటూ,నేర్చుకున్న నైపుణ్యాలను విధుల్లో ఆచరణాత్మకంగా వినియోగించాలని కోరారు. మరింత సమర్థులైన ఉద్యోగులు, వేగవంతమైన ప్రభుత్వ సేవలు, ప్రజలకు మెరుగైన ఫలితాలు–ఇదే 'ఏఐ సాక్షమ్' కార్యక్రమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, డిప్యూటీ సీఎం సెక్రటరీ, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, టీజీ మ్యాథ్ ఎండి పూజ, ఎంసిఆర్ హెచ్ ఆర్ డి డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్థిరత్వమే మేలు!

ఒక వ్యక్తి వేసుకునే దుస్తులు, తాను వాడే వాహనాలను చూసి వారి ఆర్థిక స్తోమతను అంచనా వేయడం నేటి సమాజంలో సర్వసాధారణం. అయితే బయటికి కనిపించే ఆడంబరాల కంటే భవిష్యత్తు కోసం చేసే పొదుపే అసలైన సంపద అని చాటిచెప్పే ఓ ఆసక్తికర సంఘటన సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నది. అభిషేక్‌సింగ్ అనే యువకుడు 22 ఏండ్ల వయసులో హిటాచీ కంపెనీలో తొలి ఉద్యోగంలో చేరాడు. ఆ సమయంలో తమ కార్యాలయంలో పనిచేసే మహిళా మేనేజర్ ప్రతిరోజూ 12 ఏండ్లకు పైగా పాతదైన బూడిద రంగు సాంత్రో కారులో ఆఫీసుకు వచ్చేవారట. ఆ కారు సస్పెన్షన్ సమస్య వల్ల స్టార్ట్ చేసినప్పుడు ఒక వింత శబ్దం వచ్చేదట. ప్రతిరోజూ సాయంత్రం ఆ కారు శబ్దం వినబడగానే 'ఈ పాత కారును ఎప్పుడు పారేస్తుందో' అంటూ ఆఫీసులోని ఉద్యోగులంతా నవ్వుకునేవారట కూడా. తనతో సహా ఉద్యోగులంతా ఆమెను పిసినారిగా జమకట్టేవారని, 'కానీ అసలు జోక్ మాపైనే పడిందని కొన్నేండ్ల తర్వాత అర్థమైంది' అంటూ అభిషేక్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో రాసుకొచ్చాడు. ఆ మేనేజర్ కేవలం 46 ఏండ్ల వయసులోనే ఉద్యోగానికి రిటైర్మెంట్ ప్రకటించారని తెలిసి ఆయన ఆశ్చర్యపోయాడట. ఆడంబరాల కోసం డబ్బు దండగ చేయకుండా, కుటుంబ భవిష్యత్తు కోసం పొదుపు చేయడం, సరైన మార్గాల్లో పెట్టుబడులు పెట్టడం వల్లే ఆమె అంత చిన్న వయసులోనే ఆర్థిక స్వాతంత్ర్యం సాధించారు. 'ఎవరైనా బయటికి ఏం చూపిస్తున్నారనే దానికంటే.. వారు ఎలాంటి ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటున్నారనేదే ముఖ్యం. ఆ సంఘటన తర్వాత కారును చూసి మనుషులను అంచనా వేయడం మానేశాను' అని అభిషేక్ వెల్లడించాడు. ఆయన పంచుకున్న ఈ అనుభవం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పోస్టుపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'నేను కూడా 16 ఏండ్లుగా ఒకే కారు వాడుతున్నాను, ప్రస్తుతం నా వయసు 50 ఏండ్లు' అని ఒకరు కామెంట్ చేయగా.. 'కొంచెం మంచి కారు కొనుకుని 48 ఏండ్లకు రిటైర్ అయినా జీవితాన్ని ఆస్వాదించవచ్చు కదా' అని మరొకరు భిన్నంగా స్పందించారు. 'జనాలు ఏదో ఒకటి అంటూనే ఉంటారు, అనడమే వారి పని' అనే ప్రముఖ హిందీ సామెతను మరికొందరు గుర్తుచేసుకున్నారు.

కుండీలు చూసి కొనండి

పెరటి తోటల్లో కుండీలు కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే, వీటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. సరైన కుండీని ఎంచుకున్నప్పుడే.. మొక్కలకు ప్రయోజనాలు చేకూరుతాయి.

కుండీలు చూసి కొనండి

టెర్రకోట (మట్టి) కుండీలు

మొక్కలు ఆరోగ్యంగా పెరగడంతోపాటు పర్యావరణానికీ మేలు చేయడంలో టెర్రకోట కుండీలు ముందుంటాయి. ఇవి గాలి బాగా ఆడేలా ఉంటాయి. కాబట్టి వేర్లు ఆరోగ్యంగా పెరుగుతాయి. అదనపు తేమను ఇవి పీల్చుకుంటాయి. దాంతో వేర్లు కుళ్లిపోయే ప్రమాదం తక్కువగా ఉంటుంది. కానీ, ఇవి పగిలిపోయే అవకాశం ఎక్కువ. ఎండలో ఉంచినప్పుడు నీరు త్వరగా ఆవిరైపోతుంది. కాబట్టి, తరచుగా నీరు పోయాల్సి వస్తుంది. కాక్టస్, సక్యూలెంట్స్ లాంటి నీరు తక్కువగా అవసరమయ్యే మొక్కలకు ఇవి బాగా సూటవుతాయి.

సిమెంట్ కుండీలు

ఇవి చాలా బలంగా ఉంటాయి. అవుట్ డోర్‌లో పెంచే పెద్ద మొక్కలకు బాగా సరిపోతాయి. చాలాకాలం మన్నుతాయి.

గోపులారంలో నిర్మాణంపై ప్రతాప్‌కు పంచాయతీ నోటీసులు

- **నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు**
- **మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కార్యదర్శి అమృత సూచన**
- **నిర్మాణ అనుమతులు, నిబంధనల అమలుపై అధికారుల దృష్టి**

భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । జూన్ 8, 2026 । చేవెళ్ల నియోజకవర్గం : రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం గోపులారం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 45లో చేపట్టిన నిర్మాణానికి సంబంధించి ప్రతాప్‌కు గ్రామపంచాయతీ కార్యదర్శి అమృత నోటీసులు జారీ చేశారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలుపై డీఎల్‌పీఓ ఆదేశాల మేరకు ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. నోటీసులు అందిన మూడు రోజుల్లోగా వివరణ సమర్పించాలని, సంబంధిత నిర్మాణ పనులను నిలిపివేయాలని అందులో సూచించినట్లు తెలుస్తోంది. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని నోటీసులో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణాలకు సంబంధించి అనుమతులు, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిర్మాణ అనుమతులు, నోటీసుల అమలు, తదుపరి చర్యలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

చేలల్లో చేపల వేట.. జీరో వ్యాలీ ప్రత్యేకత!

జీరోవ్యాలీ.. ప్రకృతి సౌందర్యానికి, ప్రత్యేకమైన గిరిజన సంస్కృతికి ఆలవాలం. అరుణాచల్ ప్రదేశ్‌లోని లోయర్ సుబన్సిరి జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం.. అనేక పర్యాటక విశేషాలకు నిలయం. అపటాని తెగ ప్రజల జీవన విధానం, వ్యవసాయ పొలాల్లో చేపల పెంపకం.. ఇక్కడ మాత్రమే కనిపించే అద్భుతం. ఇక సంగీత సాగరంలో ముంచి తేల్చే మ్యూజిక్ ఫెస్టివల్.. మరింత ప్రత్యేకం.

చేలల్లో చేపల వేట.. జీరో వ్యాలీ ప్రత్యేకత!

పల్లెటూర్

తూర్పు హిమాలయాల నడుమ సుమారు 5,500 అడుగుల ఎత్తులో ఉంటుంది జీరోవ్యాలీ. ఈ అందమైన లోయ ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇక్కడ ప్రధానంగా 'అపటాని' గిరిజనులు నివసిస్తుంటారు. ఇక్కడి మహిళలు ముఖంపై పచ్చబొట్లతో, పెద్దపెద్ద ముక్కు పుడకలతో ప్రత్యేకంగా కనిపిస్తారు. పూర్వకాలంలో పొరుగు తెగల దండయాత్రల నుంచి మహిళలను రక్షించుకోవడానికి ముఖాలపై పెద్ద పచ్చబొట్లు పొడుచుకోవడం, ముక్కుపుడకలు ధరించడం వంటి ఆచారాలను పాటించేవారట. కాలక్రమేణా అది వారి ప్రత్యేక సాంస్కృతిక చిహ్నంగా మారింది.

వ్యవసాయంలోనూ విశేషమే!

సంస్కృతి–సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల్లోనే కాదు.. వ్యవసాయంలోనూ తమ ప్రత్యేకత చాటుతున్నారు అపటాని ప్రజలు. నిజానికి వీరి వ్యవసాయ పద్ధతులే.. జీరో వ్యాలీకి ప్రపంచస్థాయి గుర్తింపును తెచ్చిపెట్టాయి. వరి పొలాల్లో చేపలు పెంచుతూ.. ఒకేసారి రెండు పంటలు తీస్తారు. పొలాల్లోని పురుగులు.. చేపలకు ఆహారంగా మారుతాయి; చేపల విసర్జన.. పంటకు అద్భుతమైన ఎరువుగా పనిచేస్తుంది.

పాత్రికేయులు లేని సమాజం చీకటిమయం

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం
- ఘనంగా ఐఎఫ్ డబ్ల్యూజే 76 వ వ్యవస్థాపక వేడుకలు

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28: మనిషి కి ప్రాణవాయువు ఎలాగో... సమాజానికి జర్నలిజం, జర్నలిస్టులు కూడా అలాగే అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. సూర్యుడు లేని సమాజం ఏ విధంగా ఉంటుందో జర్నలిస్టులు లేని సమాజం కూడా అదే విధంగా ఉంటుందని అన్నారు.
జర్నలిస్టులు సమాజానికి దిశా నిర్దేశం చేసే వారని, అటువంటి జర్నలిస్టులు నేడు అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్ లోని చిక్కడపల్లి లో గల త్యాగరాయ గాన సభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురు సీనియర్ పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తం మాట్లాడుతూ,పాత్రికేయులు సమాజానికి వెలుతురులాంటి వారని, పాత్రికేయులే లేకపోతే సమాజం చీకటిమయమవుతుందని అన్నారు.ఒకప్పుడు పత్రికలు, పాత్రికేయులంటే సమాజానికి, ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేసే స్థాయిలో ఉండేదని, కానీ ప్రస్తుతం రాజకీయ నాయకులు, పాలకులు జర్నలిస్టులను పావులుగా వాడుకుంటున్నారే తప్ప జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయమై చాలా నిర్లక్ష్యం చేశాయని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం సుముఖంగా ఉన్నారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తనవంతు బాధ్యతగా అన్ని విధాలుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని న్నారు. మీడియా సంస్థలు, విద్యా, వైద్య సంస్థలు చదువుకున్న వారి చేతిలో లేవని, కేవలం పెట్టుబడిదారుల చేతుల్లో మాత్రమే

ఉన్నాయని, అందుకే సమాజంలో ఇటు పత్రికలకు అటు జర్నలిస్టులకు విలువలు లేకుండా పోయాయని విమర్శించారు. గతంలో పత్రికలు నిజాలు మాత్రమే రాసేవని, పత్రికలో అగ్గిపెట్టెంత వార్త వస్తే ఎంతో స్పందన వచ్చేదని, ప్రస్తుతం నిజాలు రాసే పత్రికలు కరువయ్యాయని అన్నారు. సమాజం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు సంక్షేమ ప్రయోజనాలు సమకూర్చకపోవడం దారుణమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్క రంగానికి ఏదో ఒక లబ్ధి చేకూరుస్తున్న ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించడం చాలా బాధాకరమని అన్నారు. నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడంలో ముందున్న జర్నలిస్టులు తమ సమస్యలను తాము పరిష్కరించుకోవడంలో విఫలమవుతున్నారని అన్నారు. జర్నలిస్టులకు భూముల్లేవు, జాగలు లేవు, హెల్త్ కార్డులు లేవు, సంక్షేమ పథకాలు లేవని అన్నారు. ప్రతి ఒక్క జర్నలిస్టు సంఘటితంగా తమ యూనియన్ల హయాంలో ఉద్యమించి హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొఫెసర్‌గా తనకు జర్నలిస్టులతో విడదీయరాని అనుబంధం ఉందని, తెలంగాణ ఉద్యమ సమయంలో సైతం జర్నలిస్టులతో కలిసి పోరాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, అందుకే జర్నలిస్టుల కష్ట సుఖాలు తనకు తెలుసని ప్రొఫెసర్ పురుషోత్తం అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ 76వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులను సన్మానించడం అభినందనీయమని, ఇది సమాజంలో మంచి సాంప్రదాయమని అన్నారు. సమాజానికి విశిష్ట సేవలందించిన సీనియర్ పాత్రికేయులను మర్చిపోకుండా గౌరవించుకోవాలని, ఈ సాంప్రదాయం ఇకముందు కూడా ఇలాగే కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య మాట్లాడుతూ, దేశంలో జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక మొదటి యూనియన్ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అని అన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం సాధన కై దేశవ్యాప్తంగా పోరాడుతుందని, అదేవిధంగా రిటైర్డ్ పాత్రికేయుల కోసం జాతీయ పెన్షన్ పథకం,జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు కోసం ఉద్యమిస్తుందని అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘానికి అనుబంధంగా ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బలోపేతమై త్వరలో జర్నలిస్టుల సమస్యలపై కార్యాచరణ ప్రకటిస్తుందని మామిడి సోమయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు టి. ఉదయవర్లు, నందిరాజు రాధాకృష్ణ, అద్దంకి శ్రీరామ కుమార్, సిబి లక్ష్మి, యర్రమిల్లి రామారావు తదితరులను ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవి కుమార్, కో- కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, రాష్ట్ర నాయకులు పి.ఆనందం, కె.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ మెరుపు ధర్నా!

- ప్రత్యేక రైళ్లు కేటాయించలేదని ఆగ్రహం.. నేతల అరెస్టు

హైదరాబాద్: ఢిల్లీలో నవంబరు 1న నిర్వహించనున్న కాంగ్రెస్ నిరసన కార్యక్రమానికి తెలంగాణ నుంచి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరినా స్పందన లేకపోవడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద నిరసన కొనసాగించడంతో ఉద్రిక్తత నెలకొంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

ప్రత్యేక రైళ్ల కోసం డిమాండ్
ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమానికి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేతలు రైల్వే శాఖను కోరారు. దీనిపై సానుకూల స్పందన రాకపోవడంతో రైల్వే జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

పలువురు ముఖ్య నేతల అరెస్టు
ఈ ధర్నాలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఎంపీ రఘురామ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ వద్ద కూడా ఆందోళన కొనసాగించడంతో పోలీసులు రంగంలోకి దిగారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా పలువురు ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

మచ్చ మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించిన, ఎమ్మెల్యే..



భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి అక్టోబర్28: జనగామ జిల్లా: కొడకండ్ల మండలం, మొండ్రాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మచ్చ మల్లేష్ ఇటీవల మృతి చెందడంతో ఈరోజు పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి వారి ఇంటికి వెళ్ళి వారి చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి,వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారావత్ సురేష్ నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ధారావత్ రాజేష్ నాయక్,యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల యాకేష్, స్థానిక గ్రామ సర్పంచ్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో కరువు పరిస్థితుల నేపథ్యంలో
పుట్టినరోజు వేడుకలకుదూరంగా ఉండాలని మంత్రి పొంగులేటి నిర్ణయం

- బొకేలు, శాలువాలు, స్వీట్స్‌తో వచ్చి శుభాకాంక్షలు తెలపవద్దు
- అభిమానులు, శ్రేయోభిలాషులు ఎక్కడా ఆర్భాటాలకు తావివ్వవద్దు
- ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నిరాడంబరంగా పుట్టినరోజు

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తన అభిమానులు, శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ బొకేలు, శాలువాలు, స్వీట్స్‌తో వచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అలాగే తన పుట్టినరోజు సందర్భంగా ఎక్కడా ఎలాంటి ఆర్భాటాలు, వేడుకలు నిర్వహించవద్దని, అనవసర ఖర్చులకు దూరంగా ఉండాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంయమనం పాటించాలని, తన పుట్టినరోజును నిరాడంబరంగా గడపాలని నిర్ణయించుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. తనపై అభిమానంతో శుభాకాంక్షలు తెలియజేయాలనుకునే వారంతా ఈ నిర్ణయాన్ని గౌరవించి సహకరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

పోతుగల్ బీరప్ప ఆలయ నిర్మాణానికి సహాయం అందిస్తా

- గ్రామస్తుల విజ్ఞప్తికి సానుకూల స్పందన.. ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ

భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 28 । చేవెళ్ల నియోజకవర్గం : రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప ఆలయానికి తన వంతు సహాయం అందిస్తానని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలో అవినాష్ రెడ్డిని కలిసిన పోతుగల్ గ్రామస్తులు, గ్రామంలో నిర్మాణంలో ఉన్న బీరప్ప ఆలయానికి విరాళం అందించాలని కోరారు. గ్రామస్తుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఆయన ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామాల్లో ఆలయాల నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం కీలకమని ఈ సందర్భంగా గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, వెంకటేష్, మునీర్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజును సత్కరించిన మున్నూరుకాపు ప్రముఖులు

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, కోశాధికారి కంచి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పందిరి వేణు, కార్యదర్శి దేవుళ్ళ అరుణ్, నల్లగొండ జిల్లా అధ్యక్షులు వాసుదేవుల వెంకట నర్సయ్య, ప్రధాన కార్యదర్శి నేతి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంలో బుధవారం జరిగిన సంఘం జిల్లా శాఖ విస్తృత కార్యవర్గ సమావేశానికి హాజరైన వారు,ఆ తర్వాత బురహాన్ పురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రవిచంద్రను కలిసి ఆయన్ను శాలువాతో సత్కరించారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

- రూ.20 వేల జరిమానా విధించిన రాజేంద్రనగర్ కోర్టు

నర్సింగి, అక్టోబరు 28: భార్యను హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ రాజేంద్రనగర్‌లోని పదో అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నర్సింగి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో మహమ్మద్ గౌస్ పాషా (43) తన భార్య షాహీన్ బేగం (27)ను హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో న్యాయస్థానం ఈ శిక్ష విధించింది. జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా చెల్లించాలని ఆదేశించింది.

2018లో కేసు నమోదు
ఈ ఘటనపై నర్సింగి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 330/2018 కింద అప్పటి భారతీయ శిక్షాస్మృతిలోని 302వ సెక్షన్ ప్రకారం కేసు నమోదైంది. సెషన్స్ కేసు నంబర్ 1191/2018గా విచారణ కొనసాగింది. 2026 అక్టోబరు 23న న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

ఏపీపీకి సత్కారం
ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన సహాయ ప్రభుత్వ న్యాయవాది (ఏపీపీ) శ్రీమతి సృజనారెడ్డిని ఈ సందర్భంగా కలిసి అభినందించి సత్కరించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు కేంద్రం వరం
పీఎం రాహత్ పథకం ద్వారా రూ.1.5 లక్షల ఉచిత వైద్యం

- పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పాలకుర్తి అ ప్రజలకు పిలుపు



భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి అక్టోబర్28: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులను ఆదుకోవడానికి కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి రహత్ (పీఎం రాహత్) పథకాన్ని పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ పథకం కింద ప్రమాద బాధితులకు అత్యవసరంగా రూ. 1.5 లక్షల వరకు 7 రోజుల పాటు క్యాష్ లెస్ వైద్య సేవలు అందుతాయని తెలిపారు.

పథకం ముఖ్య ఉద్దేశాలు:
రోడ్డు ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే వైద్యం అందితే 50 శాతం ప్రాణాలను కాపాడవచ్చనే ఉద్దేశంతో ఈ పథకాన్ని కేంద్రం తీసుకువచ్చింది. ఏ రోడ్డుపై ప్రమాదం జరిగినా, డ్రైవర్, ప్రయాణికుడు, బాటసారి, సైకిల్ దారుడు ఎవరైనా ఈ పథకానికి అర్హులని, హిట్ అండ్ రన్ కేసులకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్ కు డయల్ చేస్తే, దగ్గరలోని ఆసుపత్రి వివరాలు, అంబులెన్స్ సౌకర్యం వెంటనే లభిస్తుందని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు ఈ పథకం గురించి తెలుసుకొని అవసరమైన సమయంలో వినియోగించుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ పథకం కింద కేంద్రం ఏటా రూ. 100 కోట్లు కేటాయిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం తగినన్ని ఆసుపత్రులను నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని ప్రైవేట్ ఆసుపత్రులను ఈ పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు వేల్పుల దేవరాజ్ పాలకుర్తి బిజెపి మండల ప్రధానకార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పసునూరి నాగేశ్వర్ మరణం బాధాకరం, సోమేశ్వర్...

భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి అక్టోబర్28: పాలకుర్తి మండలం, ఇరవెన్ను గ్రామానికి చెందిన పసునూరి నాగేశ్వర్ అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిర్రు సోమేశ్వర్, గ్రామ సర్పంచ్ గాదరి కుమారస్వామి, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు గోనె మహేందర్, మృతుడి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సింగిరెడ్డి సత్తిరెడ్డి, అనుముల రమేష్, కొనకటి ఎల్లయ్య, కోడిశాల బాబు, వార్డు సభ్యులు జక్కుల రాజశేఖర్, కోడిశాల జయ, నాయకులు పులి సుధాకర్, తొడుసు ఐలయ్య,కుస అనిల్, మహేందర్, గాదరి జనార్ధన్ తదితర ముఖ్య నాయకులున్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి అక్టోబర్28: పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఇందిరమ్మ మైనారిటి మహిళా శక్తి పథకము ద్వారా ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన,ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, వారి వెంట, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, ఆత్మ బ్లాక్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మంజుల భాస్కర్ నాయక్, రాజేష్ నాయక్, తదితరులున్నారు.

కరువును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనల మేరకు చర్యలు

- ప్రకృతి విపత్తును అధిగమించేందుకు సానుకూల, నిర్మాణాత్మక వైఖరి
- తెలంగాణ రాష్ట్రం, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : కరువు పరిస్థితులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అంతర్రాష్ట్ర నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావు హాజరయ్యారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులు, వాటివల్ల ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, కరువు నివారణకు ముందస్తు చర్యలు వంటి కీలక అంశాలపై అఖిలపక్ష నాయకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ ప్రతిపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభ యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు హేమ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వం శ్రద్ధగా ఆలకించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తదుపరి కార్యాచరణను నిర్ణయించే సమయంలో వారి అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్న నాయకులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఎదురవుతున్న సవాళ్లను నిర్మాణాత్మక దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. "నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షత ఎల్‌నినో, కరువు పరిస్థితులపై రాష్ట్ర అఖిలపక్ష భేటీ

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరో అంతస్తులోని గది నంబర్ 33లో ప్రారంభమైన సమావేశం. సమావేశానికి హాజరైన మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు. ఎల్ నినో నోడల్ ఆఫీసర్ రామకృష్ణారావు సమావేశానికి హాజరైన అఖిలపక్ష నాయకులు కాంగ్రెస్ నేత అంజన్ కుమార్ యాదవ్, రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వినోద్ కుమార్, ఎల్ రమణ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బిజెపి ప్రతిపక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధ్యక్షులు అసధుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాం, సమాజ్వాది పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జెడి నాయకులు శోభ యాదవ్, బిఎస్పీ రాష్ట్ర నాయకులు శ్రీరామ్ కృష్ణ, అమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు హేమ సుదర్శన్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి కీలక అంశాలపై రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. కరువు నివారణకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ముందస్తు చర్యలపై అఖిలపక్ష నేతల అభిప్రాయాలను క్యాబినెట్ సబ్ కమిటీ మంత్రుల బృందం తెలుసుకోనుంది.

పట్టభద్రుల ఎన్రోల్మెంట్ లో దేవరకొండ జనసేన నేత కోర్ర చందు నాయక్ ప్రథమ స్థానం ఖమ్మం - వరంగల్ - నల్లగొండ

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకం - చందు నాయక్‌కు సత్కారం

- అత్యధిక ఎన్రోల్మెంట్ చేసిన చందు నాయక్ కు ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్ అభినందనలు జనసేన పట్టభద్రుల ఎమ్మెల్సీ సమావేశం
- దేవరకొండలో జోష్ పెంచిన కోర్ర చందు నాయక్

నల్లగొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్యు: ఖమ్మం–వరంగల్– నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నల్లగొండ లోని హోటల్ విష్టా గ్రాండ్‌లో జనసేన పార్టీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జనసేన తెలంగాణ రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి మరియు ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల జనసేన పీఓసీలు, ముఖ్య నాయకులు పాల్గొని ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా గడల శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ... పట్టభద్రుల ఓటర్ల నమోదు (ఎన్రోల్మెంట్) ప్రక్రియలో దేవరకొండ నియోజకవర్గ జనసేన నాయకుడు కోర్ర చందు నాయక్ అత్యధికంగా ఎన్రోల్మెంట్ నమోదు చేయించి మొదటి స్థానంలో నిలిచారని ప్రశంసించారు. చందు నాయక్ కృషిని అభినందిస్తూ కోఆర్డినేటర్ ప్రజిత్ గౌడ్‌తో కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కోర్ర చందు నాయక్ మాట్లాడుతూ... గత 13 సంవత్సరాలు గా జనసేన పార్టీలోనే కొనసాగుతూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నానని, తనను గుర్తించి ప్రోత్సహిస్తున్న ప్రజిత్ గౌడ్ గారికి, గడల శ్రీనివాసరావు గారికి ధన్యవాదాలు తెలిపారు. పవన్ కళ్యాణ్ గారు తెలంగాణ వైపు రావాలని, తెలంగాణ ప్రజల బాధను బాధ్యతగా తీసుకోవాలని, గడల శ్రీనివాస్ గారిని భారీ మెజారిటీతో గెలిపించి పవన్ కళ్యాణ్ గారికి గిఫ్ట్ గా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ ప్రజిత్ గౌడ్, నరేష్ గౌడ్, బవండ్ల సాయి, కాటేపాక నవీన్, పిట్ల సిద్దు, రవి, వంటేద్దు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

NHM ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

- సమ్మె శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : NHM ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో NHM JAC ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె బుధవారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో NHM ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు డా. బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్, జీూజ సభ్యులు హైమావతి, డాక్టర్ జగన్, భీముడు, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీపై పర్యవేక్షణ ఏది? ప్రజల ఆరోగ్యానికి భరోసా ఏది?

- శంకర్‌పల్లి మండలంలో ఆహార భద్రత తనిఖీలు ముమ్మరం చేయాలి
- హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, కిరాణా దుకాణాల్లో నాణ్యతా పరీక్షలు చేపట్టాలి
- కాలం చెల్లిన ఆహార పదార్థాలు, కల్తీ విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి
- జిల్లా కలెక్టర్, జిల్లా ఆహార భద్రత అధికారి, శంకర్‌పల్లి మున్సిపల్ అధికారులు స్పందించాలి

భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 28 । చేవెళ్ల నియోజకవర్గం : రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంతో పాటు శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందుతోందా అనే అంశంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, టీ స్టాళ్లు, చిరుతిళ్ల దుకాణాలు, కిరాణా షాపులు, ఇతర ఆహార విక్రయ కేంద్రాలు ప్రజలకు నిత్యం సేవలందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆహార పదార్థాల నాణ్యత, తయారీలో పరిశుభ్రత, నిల్వ విధానాలు, తాగునీటి స్వచ్ఛత, వంటశాలల నిర్వహణ, ఆహార పదార్థాలపై తయారీ తేదీ, గడువు తేదీ వివరాలను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలి. కాలం చెల్లిన ఉత్పత్తులు, నాణ్యత లేని పదార్థాలు, కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు ఎక్కడైనా గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అయితే శంకర్‌పల్లి పరిధిలో ప్రస్తుతం ఎన్ని తనిఖీలు నిర్వహిస్తున్నారు, ఎన్ని ఆహార నమూనాలు సేకరిస్తున్నారు, తనిఖీల్లో ఎలాంటి లోపాలు గుర్తించారు, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపార సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ఆహార భద్రత శాఖ అధికారులపై ఉంది.

ఆహార భద్రత వాహనాల వినియోగంపై స్పష్టత ఇవ్వాలి

ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఫుడ్ సేఫ్టీ వాహనాలు శంకర్‌పల్లి మండలం, మున్సిపాలిటీ పరిధిలో వినియోగిస్తున్నారా లేదా అనే అంశంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలి. ఈ వాహనాల ద్వారా ఆహార నమూనాల సేకరణ, ప్రాథమిక పరీక్షలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉన్నందున వాటి సేవలను స్థానిక ప్రాంతాలకు కూడా అందుబాటులోకి తీసుకురావాలి. హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఆహార భద్రత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా విద్యార్థులు, చిన్నపిల్లలు, కుటుంబాలు తరచుగా ఆహారం తీసుకునే కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యాపారులు కూడా నాణ్యమైన ముడి పదార్థాలను వినియోగించడం, ఆహారాన్ని సురక్షితంగా నిల్వ చేయడం, పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయడం వంటి నిబంధనలను పాటించాలి.

అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఆహార భద్రత అధికారి, సంబంధిత ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు, శంకర్‌పల్లి మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఆహార విక్రయ కేంద్రాలపై పర్యవేక్షణను బలోపేతం చేయాలి. మున్సిపల్ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, ఇతర ఆహార విక్రయ సంస్థల్లో పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించాలి. ఆహార భద్రతకు సంబంధించిన అనుమతులు, లైసెన్సులు, నిల్వ విధానాలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను సంబంధిత నిబంధనల ప్రకారం తనిఖీ చేయాలి. ప్రజలకు అనుమానం కలిగించే ఆహార పదార్థాలు కనిపిస్తే ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న అధికారిక మార్గాలపై అవగాహన కల్పించాలి. తనిఖీల వివరాలు, గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలపై పారదర్శకంగా సమాచారం వెల్లడించాలి. శంకర్‌పల్లి మండలంలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోనూ ఆహార భద్రత తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణ సాంస్కృతిక వరసత్వంపై మతోన్మాదుల రుద్దిన తప్పుడు చరిత్రను తుడిచివేయాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతుల శశిధర్ చెప్పారు

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : హైదరాబాదులో ప్రభుత్వ భూములను పోరీష అధికారులు రెవిన్యూ అధికారులు దేవాలయ భూములను రజాకార్లు నీటికే ఆక్రమిస్తున్నారని నిజాం వారసుల పేరిట ఇప్పటికి తప్పుడు పత్రాలతో రాష్ట్రంలో విలువైన భూములు కబ్జాలు చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు రాముడు విగ్రహం తొలగించిన శ్రీరాం చౌక్ చుట్టుపక్కల ప్రాంతాలు అమ్మవారి దేవాలయాలది చట్టం పేరు చెప్పి శ్రీరాముల విగ్రహాన్ని తొలగించిన అబిడ్స్ పోలీస్ స్టేషన్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమి ఆక్రమణలు నిర్మింపబడిన ది నిర్మించిన మహాత్మా గాంధీ బస్టాండు దేవాలయం భూమిలో నిర్మించారని బంజర హిల్స్ రోడ్ నెంబర్లు నరసింహస్వామి ఆలయానికి చెందిన 47 ఎకరాల 19 సెంట్లు భూమిని ఏమైందని ఆయన ప్రశ్నించారు ఐసీసీ భవనం దేవాలయ భూములు కట్టిందేనా ప్రభుత్వం స్పష్టం చేయాలని భాగ్యనగరంలోని 3 వేల ఎకరాలు తొమ్మిది గుంటలు రికార్డులు ఎక్కడ అని ప్రభుత్వం హిందూ సమాజానికి లెక్కలు చెప్పాల చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు మన ప్రాంతంలో ఇస్లామిక్ మతోన్మాద పాలనపై పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొమరం భీమ్ చాకలి ఐలమ్మ దాశరధి కాళోజీ స్వామి రామానంద్ తీర్థ మహనీయులు నివాళులు అర్పించి నాయకులు నిజాం ఆకృత్యాల మాట్లాడడం వారి కుహన సెక్యులర్ రీజానికి నిదర్శమని ఆయన చెప్పారు ఈ సమావేశంలో మట్టు మందిర్ అఖిలభారత సంయోజక్ రామరాజు సునీత రామ్మోహన్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలంగాణ సంస్థ వారసత్వంపై మతోన్మాదృద్దిన తప్పుడు చరిత్రలు తూర్పువేయాలని వారు డిమాండ్ చేశారు.

ఏకంగా 23 దేశాలను చుట్టి మణిపూర్‌కు తిరిగొచ్చిన అమూర్ ఫాల్కన్స్..!

కొన్ని వేల కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత రెండు అమూర్ ఫాల్కన్ బర్డ్స్ సురక్షితంగా మణిపూర్‌కు తిరిగొచ్చాయి. 'అపపాంగ్ ', 'అలాంగ్ ' అని పేరుపెట్టిన ఈ పక్షులు తమ వార్షిక వలస ప్రయాణంలో భాగంగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని 23 దేశాలను చుట్టి వచ్చాయని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ శనివారం ప్రకటించారు. ఈశాన్య చైనా లోని తమ సంతానోత్పత్తి కేంద్రాల నుంచి బయలుదేరిన 11రోజుల తర్వాత ఇవి మణిపూర్‌లో వాలాయి. 2025 నవంబర్‌లో 'వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' శాస్త్రవేత్తలు ఈ రెండు పక్షులకు శాటిలైట్ ట్యాగ్‌లు అమర్చి విడిచిపెట్టారు. అప్పటి నుంచి వాటి ప్రయాణ మార్గాన్ని నిరంతరం గమనించారు. సరిగ్గా ఏడాది తర్వాత అవి మళ్లీ మణిపూర్‌కు తిరిగి రావడంతో ఈట్రాకింగ్ సైకిల్ విజయవంతంగా పూర్తయింది. ఫాల్కన్ పక్షుల తిరిగిరాకతో పక్షి ప్రేమికులు, పర్యావరణవేత్తలు ఆనందం వ్యక్తం

చేస్తున్నారు. ఈ పక్షులు మణిపూర్‌లోని తమెంగ్‌లాంగ్ జిల్లా పర్వత ప్రాంతాల్లో రెండు నుంచి మూడు వారాలపాటు ఉంటాయి. ఈ సమయంలో ఇక్కడి చెద పురుగులను ఆహారంగా తీసుకుని, తమ తదుపరి సుదీర్ఘ ప్రయాణానికి అవసరమైన శక్తి కోసం శరీరంలో కొవ్వును నిల్వ చేసుకుంటాయి. ఇక్కడ విశ్రాంతి తీసుకున్న తర్వాత తమ వలస ప్రయాణంలో అత్యంత కఠినమైన దశను ప్రారంభిస్తాయి. తదుపరి మజిలీగా ఇవి సోమాలియాకు బయలుదేరతాయి. అందు కోసం దాదాపు 6,000 కిలోమీటర్ల దూరం ఎక్కడా ఆగకుండా ప్రయాణిస్తాయి. ఈ ప్రయాణంలో అరేబియా సముద్రంపై సుమారు 3,000కిలోమీటర్ల దూరం అవిశ్రాంతంగా ఎగరాల్సి ఉంటుంది. అమూర్ ఫాల్కన్లు ఈశాన్య ఆసియాలో సంతానోత్పత్తి చేసి శీతాకాలంలో ఆఫ్రికాకు వలస వెళతాయి. ఈ క్రమంలో ఈశాన్య భారతదేశం వాటికి కీలకమైన విశ్రాంతి కేంద్రంగా ఉన్నది. ఏటా తమ ప్రాంతానికి వచ్చే ఈ అతిథులను స్థానిక సమాజాలు ఎంతో ప్రేమగా చూసుకుంటూ, వాటి సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

గురువారం,
అక్టోబర్ 29, 2026
భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక

ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది

- కరువుపై ముందస్తు కార్యాచరణ.. కేంద్రానికి నివేదిక పంపించాము
- అవసరమైతే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి సాయం సాధిస్తాం
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ
- అఖిలపక్ష నేతల సూచనలను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్తాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కరువు నివారణపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో అఖిలపక్ష సమావేశం
- తాగు, సాగు నీరు, విద్యుత్ సరఫరాపై అఖిలపక్ష నేతల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ
- అఖిలపక్ష సమావేశానికి హాజరైన మంత్రులు ఉత్తం, పొంగులేటి, సీతక్క, తుమ్మల, శ్రీహరి.

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన వర్షాభావ, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని ముందస్తు జాగ్రత్తలు, చర్యలను తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామని, అవసరమైన సమయంలో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన సహాయంపై విజ్ఞప్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీల సూచనలను పరిగణనలోకి తీసుకొని సమష్టి కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర మంత్రులు ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, నోడల్ అధికారి రామక్రిష్ణరావులు హాజరయ్యారు. ఈ అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ తరఫున అంజన్ కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, బీఆర్ఎస్ తరఫున వినోద్ కుమార్, ఎల్. రమణ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీజేపీ తరఫున శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభా యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హేమ సుదర్శన్, తెలుగుదేశం పార్టీ తరఫున కాట్రగడ్డ ప్రసన్నకుమార్ తదితరులు కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, రైతులకు అండగా నిలిచే చర్యలు, తాగునీరు–సాగునీటి సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ విపత్తు పరిస్థితులను ఎదుర్కొనే సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితోనే అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించామని తెలిపారు. నేతలు ప్రస్తావించిన అంశాలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంపై గతంలోనూ శాసనసభలో చర్చించామని, వివిధ సమావేశాలు, సదస్సులు నిర్వహించడంతో పాటు శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రానున్న నెలల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని పేర్కొన్నారు. వర్షపాతం లోటు ఒక్క తెలంగాణకే పరిమితమైతే పొరుగు రాష్ట్రాల్లో కురిసే వర్షాలతో ప్రాజెక్టులకు నీరు చేరే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాలు, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ వర్షపాతం లోటు ఏర్పడటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లో జలవనరుల నిర్వహణ మరింత కీలకంగా మారిందని వివరించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తూ, వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తామని, పశువులకు తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాస్త్రవేత్తలు, నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకుని పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. అఖిలపక్ష నేతలు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న నీటి అవసరాలను తీర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్ష నేతలు చేసిన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. పట్టణాలతోపాటు

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను రూపొందించామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, పశువులకు అవసరమైన నీటి వసతులు కల్పించేందుకు అవసరమైన బడ్జెట్, ఇతర ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సమావేశంలో వచ్చిన సూచనలను పరిశీలించి, అమలుకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో అన్ని చర్యలు చేపడుతూనే, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా సమర్థవంతంగా వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే కేంద్రానికి నివేదిక పంపించామని, అవసరమైన సహాయం అందేలా ప్రతిపాదనలు సమర్పిస్తామని చెప్పారు. కేంద్రం నుంచి అవసరమైన సహాయం పొందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధులతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి రాష్ట్రానికి అవసరమైన సహాయాన్ని కోరుతామని చెప్పారు. గతంలో కరోనా వంటి సంక్షోభాలను ఎదుర్కొన్న సమయంలో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేశాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లోనూ రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్లపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించి రాష్ట్రాన్ని కరువు ముప్పు నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల సాధనలో రాజకీయాలకు తావులేకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యంగా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అఖిలపక్ష సమావేశంలో పాల్గొని విలువైన సలహాలు, సూచనలు అందించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

అడిగినట్టు వండిస్తారు

ఏ స్వీట్ షాప్‌కైనా పోయి.. 'ఇది ఎక్కువ ఉండాలి. అది తక్కువ ఉండాలి. మరొకటి అసలే ఉండొద్దు'అంటే 'అలాంటివి లేవు పో' అంటారు. అక్కడ ఉన్నవే కొనాలి. వాళ్లిచ్చిందే తినాలి. కాదని వాదులాడితే కస్టమర్ బీపీ ఇంకొంచెం పెరుగుతుంది. వీళ్లు మాత్రం.. ఉప్పు, కారం, చక్కెర.. ఇంకేదైనా లేకుండా వండిపెట్టమని ఆర్డరిస్తే వండిస్తారు. ఇలాగే వండాలని ఆర్డర్ చేసినా ఓకే అంటారు.

చిరుతిళ్లకు ఆర్డర్ చేస్తే సరి!

హైదరాబాద్‌లో పలు టీవీ చానెల్స్‌లో వంగపల్లి పద్మ ఉద్యోగం చేసింది. కొన్నాండ్ల తర్వాత మీడియా రంగాన్ని వదిలిపెట్టింది. సుస్థిర వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడుతూ, ఆరోగ్యవంతమైన ఆహారానికి మద్దతిచ్చే సెంటర్ ఫర్ సస్టైయినబుల్ అగ్రికల్చర్‌లో చేరింది. ఆ సంస్థ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు సేకరించేది. వాటిని 'సహజ ఆహారం' స్టోర్లలో విక్రయించేది. హైదరాబాద్‌లోని స్టోర్‌లో పద్మ 'ఫుడ్ ఎక్స్‌పర్ట్'గా కొత్త ప్రయాణం మొదలుపెట్టింది. సహజ ఆహారం స్టోర్‌లోనే ఒక చిన్న కిచెన్ ఉండేది. అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలతో రకరకాల చిరుతిళ్లు, పొడులు తయారు చేసేవాళ్లు. స్వీట్స్, హాట్స్, బిస్కెట్స్, సేమియాల తయారీ కోసం పద్మ లీడర్‌గా ఉన్న టీమ్ ఎక్స్‌పెరిమెంట్స్ చేస్తుండేది. కొన్ని ఎక్స్‌పెరిమెంట్స్ చేసిన తర్వాత వంటకం పర్ఫెక్ట్ అనుకున్నాక స్టోర్‌లో

అమ్మేవాళ్లు. ఇలా దాదాపు అరవై ఉత్పత్తుల్ని తయారు చేసింది. అయిదేండ్ల తర్వాత ఆ ఉద్యోగం మానేసింది.

మేడ్ ఇన్ 'స్వీట్ హోమ్'

కొన్ని సంవత్సరాల విరామం తర్వాత మళ్లీ ఆరోగ్యకరమైన వంటలవైపు దృష్టి సారించింది పద్మ. శరీరాన్ని కాపాడే ఆహారం తయారీ కూడా ఆరోగ్యవంతమైన సమాజం కోసం పని చేయడమనే ఆలోచనతో కొద్ది కాలం క్రితం మళ్లీ స్వీట్స్, తినుబండారాలు వండటం మొదలుపెట్టింది. పొడులు, పచ్చళ్లు కూడా ప్రయోగాలు చేస్తూ ఆరోగ్యం కోసం సంప్రదాయ వంటల్ని నగరానికి పరిచయం చేసే ప్రయోగాన్ని ఇంట్లోనే మొదలుపెట్టింది. హాలే కార్యశాల. కిచెనే ఉత్పత్తి కేంద్రం. సోషల్ మీడియా వాళ్ల స్టోర్. 'మిల్లెట్స్‌తో చిరుతిళ్లు తయారు చేయాలి. మహిళలతో చిన్న సంస్థను నడపాలి' అనే సంకల్పంతో మొదలైన పద్మకు మరో నలుగురు తోడయ్యారు. అనుకున్న రోజున అందరూ తీరిక చేసుకుని.. రాగి, జొన్న, కొర్ర, సజ్జలతో మురుకులు, లడ్డూలు, బూందీ తయారు చేస్తారు. వీటితోపాటు సజ్జ గవ్వలు, మిక్స్‌డ్ మిల్లెట్ బూందీ, మిల్లెట్ చెగోడీలు కూడా తయారు చేస్తారు. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి అనుమతులు తెచ్చుకుని 'స్నాక్స్ బుట్ట' పేరుతో వాళ్ల ఉత్పత్తుల్ని అమ్ముతున్నారు.

సహకారమే మా ఉపకారం

స్నాక్స్ బుట్ట వేదికగా చిరుతిళ్లు, కారం పొడులు, పచ్చళ్లు (ఆర్డర్‌పై) అమ్ముతున్నారు. వీటి తయారీకి ఉపయోగించే ఆహార పదార్థాలన్నీ రైతుల నుంచే కొనుగోలు చేస్తారు. గ్రామీణ సహకార సంస్థలు తయారు చేసే వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఉత్పత్తులే ఈ స్నాక్స్ తయారీలో వాడతామని చెబుతున్నది పద్మ. తృణ ధాన్యాలు, పప్పులు, కారం వంటి వ్యవసాయ ఉత్పత్తుల్ని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ నుంచి కొనుగోలు చేస్తామని, స్నాక్స్ తయారీకి ఉపయోగించేందుకు విజయ (తెలంగాణ) నూనెలు మాత్రమే వాడతామని, బెల్లం విజయనగర ప్రాంత రైతుల నుంచి సేకరిస్తామని చెప్పింది.

ప్రభుత్వ ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంపొందించుకోవాలి

- ప్రభుత్వ ఉద్యోగులు ఆధునిక సాంకేతికతలో అప్‌డేట్ కావాలి
- ఏఐతో ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలి
- కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు తిరిగి అందాలి
- 'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంపొందించుకుని, తమ రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఏఐ శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ వినియోగం వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు వేగవంతం కావడంతోపాటు, సామాన్య ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలి. కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు మెరుగైన సేవల రూపంలో తిరిగి అందాలి. ప్రజల జీవితాల్లో కనిపించే సానుకూల మార్పే ఏఐ వినియోగానికి అసలైన గీటురాయి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ప్రణాళికా శాఖ సహకారంతో టీజీ మ్యాథ్ చేపట్టిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించి, పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. సాంకేతికతలో వస్తున్న మార్పులను ఉద్యోగులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీగా నిర్వహించే పనులను మరింత వేగంగా, సమర్థంగా పూర్తి చేసేందుకు ఏఐ సాధనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను గుర్తించడం, నివేదికలను రూపొందించడం, సమాచారాన్ని విశ్లేషించడం, ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరాలు అందించడం వంటి పనుల్లో ఏఐ ద్వారా సమయం ఆదా చేయవచ్చన్నారు. శిక్షణలో ఉద్యోగులు చురుగ్గా పాల్గొని, తమ విధులకు అనుగుణంగా ఏఐ సాధనాలను ఉపయోగించే పద్ధతులను నేర్చుకోవాలని కోరారు. ఒక రైతు దరఖాస్తు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారుడికి తనకు అందాల్సిన ప్రయోజనాలపై స్పష్టమైన సమాచారం లభించడం, ఒక పౌరుడు తన పని కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం తగ్గడం వంటి మార్పులు సాంకేతికత వినియోగం ద్వారా సాధ్యపడాలని పేర్కొన్నారు. ఉద్యోగులు ఆదా చేసిన సమయాన్ని ప్రజల సమస్యలను మరింత శ్రద్ధగా పరిశీలించేందుకు, సేవల నాణ్యతను పెంచేందుకు వినియోగించాలని సూచించారు.

ఆర్థిక, ప్రణాళికా రంగాల్లో మెరుగైన ఫలితాలు

ప్రజాధనం వినియోగాన్ని విశ్లేషించడం, ప్రాజెక్టుల వ్యయాలను పోల్చడం, పనుల అమలులో జాప్యాలకు కారణాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐ ఆధారిత సాధనాలు అధికారులకు సహాయపడగలవని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ వనరులను సమర్థంగా వినియోగించుకోవడానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలును మెరుగ్గా పర్యవేక్షించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రణాళికా రంగంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయో విశ్లేషించడం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారందరికీ చేరుతున్నాయా అనే అంశాలను పరిశీలించడం ద్వారా మెరుగైన ప్రణాళికలు రూపొందించవచ్చని తెలిపారు. గణాంకాలతోపాటు క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజల అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ రంగంలోనూ ఏఐతో ప్రయోజనాలు

విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేయడం, పరికరాల్లో తలెత్తే లోపాలను గుర్తించడం, నిర్వహణ చర్యలను మెరుగుపరచడం వంటి అంశాల్లో ఏఐ ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా విద్యుత్ నిర్వహణను మెరుగుపరిచి, రైతులు, పరిశ్రమలు, ఆసుపత్రులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఏఐ సాధనాలను ఉపయోగించే సమయంలో సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యమివ్వాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనుమతి లేని

సాధనాల్లో అధికారిక లేదా వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయరాదన్నారు. ఏఐ రూపొందించిన సమాచారాన్ని అధికారిక రికార్డుల్లో చేర్చే ముందు, నిర్ణయాలకు ఆధారంగా ఉపయోగించే ముందు అధికారులు ధ్రువీకరించాలని సూచించారు. సాంకేతికత సహాయంతో పనులు నిర్వహించినప్పటికీ తుది నిర్ణయాలు, వాటికి సంబంధించిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. ప్రతి శాఖలో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, ముందుగా ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సూచించారు. ఫలితాలను పరిశీలించి, ప్రజలకు కలిగే ప్రయోజనం, పనితీరు, కచ్చితత్వం ఆధారంగా విస్తరణ చేపట్టాలని తెలిపారు. ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ శిక్షణను ప్రభుత్వ ఉద్యోగులందరూ ఒక అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతరం అవగాహన పెంపొందించుకుంటూ, నేర్చుకున్న నైపుణ్యాలను విధుల్లో ఆచరణాత్మకంగా వినియోగించాలని కోరారు. మరింత సమర్థులైన ఉద్యోగులు, వేగవంతమైన ప్రభుత్వ సేవలు, ప్రజలకు మెరుగైన ఫలితాలు–ఇదే 'ఏఐ సాక్షమ్' కార్యక్రమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, డిప్యూటీ సీఎం సెక్రటరీ, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, టీజీ మ్యాథ్ ఎండి పూజ, ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో మృతి చెందిన చిత్తలూరి మధు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి అక్టోబర్28: కరెంట్ షాక్ తో అకాల మరణం పొందిన చిత్తలూరి మధు కుటుంబాన్ని మాజీ మంత్రి, పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు గారు ధర్మాపురం గ్రామంలో పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మధు చిత్రపటానికి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వం నుండి రావాల్సిన సాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసిన శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28: వచ్చే నెల 4న ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే సదర్ ఉత్సవాలకు ఆహ్వానం. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపిన కమిటీ ప్రతినిధులు. కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ శ్రీ చైర్మన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, ఇతర నాయకులు.

వెట్టిచాకిరీ కార్మికుల గుర్తింపు, విముక్తి

- పునరావాసానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం

నాగర్‌కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : జిల్లాలో వెట్టిచాకిరీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు, బాధిత కార్మికులను గుర్తించి విముక్తి కల్పించడంతోపాటు వారికి పునరావాసం అందించి, వారి హక్కులను పరిరక్షించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. వెట్టిచాకిరీ కార్మికుల గుర్తింపు, విముక్తి, ఆర్థిక సహాయం, పునరావాసం తదితర అంశాలపై బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించి, బాధితులకు అందుతున్న ప్రభుత్వ సహాయంపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సమీక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఏర్పడిన అనంతరం ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 161 మంది వెట్టిచాకిరీ కార్మికులను గుర్తించి, వారికి విముక్తి కల్పించినట్లు సమావేశంలో లేబర్ అధికారి రాజ్ కుమార్ వెల్లడించారు. వీరిలో 71 మందికి ప్రభుత్వం ద్వారా పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందించినట్లు అయన కలెక్టర్‌కు తెలిపారు. మరో 26 మందికి తాత్కాలికంగా రూ.5 వేల చొప్పున ప్రాథమిక ఆర్థిక సహాయం అందించగా, ఒక్కొక్కరికి మిగిలిన రూ.15 వేల చొప్పున సహాయం అందించాల్సి ఉందని వివరించారు. అదేవిధంగా మరో 64 మంది విముక్తి పొందిన కార్మికులకు ఆర్థిక సహాయం అందించాల్సి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., అర్హులైన బాధితులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సహాయం అందించడంలో జాప్యం జరగకుండా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వెట్టిచాకిరీకి గురవుతున్న కార్మికులను గుర్తించి, వారిని ఆ దోపిడీ నుంచి విముక్తి కల్పించడంతోపాటు అవసరమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని సూచించారు. విముక్తి పొందిన కార్మికులు తిరిగి వెట్టిచాకిరీలోకి వెళ్లకుండా వారికి జీవనోపాధి అవకాశాలు కల్పించడం, పునరావాస పథకాల ప్రయోజనాలు అందించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని, బాధితులకు అవసరమైన ప్రభుత్వ సహాయం, న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెట్టిచాకిరీ నిర్మూలనలో కార్మిక శాఖతోపాటు రెవెన్యూ,

పోలీసు, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, బ్యాంకింగ్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. బాధితుల వివరాలను సమగ్రంగా సేకరించి, అర్హత మేరకు వారికి అందాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి చెన్నయ్య, జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్ కుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి ఉమాపతి, ఆర్డీవోలు అర్చన జనార్దన్ రెడ్డి, బన్సీలాల్, కలెక్టరేట్ సి సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, షీ టీం ఎస్సై విజయ, సీసీఎస్ సీఐ శంకర్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్ బి వ్యాధిగ్రస్తులకు కొత్త ఔషధం.. ఆమోదం తెలిపిన అమెరికా ఎఫ్‌డీఏ..



దీర్ఘకాలిక హెపటైటిస్ బి వ్యాధితో బాధపడుతున్న కొందరు రోగులు యాంటీవైరల్ మందులను నిలిపివేసిన తర్వాత కూడా వైరస్‌ను నియంత్రణలో ఉంచుకునే అవకాశం కల్పించే కొత్త చికిత్సకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) ఆమోదం తెలిపింది.

ఎవరు తీసుకోవచ్చు..

కాలేయంలో సిరోసిస్ లేని, కనీసం ఆరు నెలలుగా యాంటీవైరల్ చికిత్స పొందుతూ రక్తంలో హెపటైటిస్ బి వైరస్ స్థాయిలు నియంత్రణలో ఉన్న వయోజనులకు మాత్రమే ఈ చికిత్స వర్తిస్తుంది.

24 శాతం మందికి విజయవంతం..

రెండు ప్రయోగాలను కలిపి పరిశీలించినప్పుడు, కొత్త మందు తీసుకున్న వారిలో 24 శాతం మంది తమ పాత యాంటీవైరల్ చికిత్సను నిలిపివేయడానికి అవసరమైన ప్రమాణాలను చేరుకున్నారు. పోలిక కోసం మందు బదులుగా ప్లాసీబో తీసుకున్నవారిలో ఒక్కరూ ఈ ప్రమాణాలను చేరుకోలేదు. హెపటైటిస్ బి చికిత్స మొత్తాన్ని నిలిపివేసిన 24 వారాల తర్వాత కూడా కొత్త మందు పొందిన వారిలో 19శాతం మందికివైరస్ నియంత్రణలో ఉన్నట్లు గుర్తించారు.

వైద్య పర్యవేక్షణ అవసరం..

ఈ చికిత్స తీసుకునే రోగులకు మందు వాడకానికి ముందు, చికిత్స సమయంలో క్రమం తప్పకుండా రక్త పరీక్షలు, వైద్య పర్యవేక్షణ అవసరం. ఇంజెక్షన్ ఇచ్చిన చోట ప్రతిచర్యలు, జ్వరం, అలసట, తలనొప్పి వంటి దుష్ప్రభావాలు ఎక్కువగా నమోదయ్యాయి. అర్హులైన రోగులను గుర్తించేందుకు, చికిత్సను పర్యవేక్షించేందుకు రోష్ సంస్థ అభివృద్ధి చేసిన అనుబంధ నిర్ధారణ పరీక్షకూ ఎఫ్‌డీఏ అనుమతిచ్చింది.

శారీరకంగా అలసిపోయినా కొందరికి నిద్ర పట్టదు.. కారణం ఏమిటి..?

శారీరకంగా చాలా అలసిపోయినప్పటికీ కొంతమందికి రాత్రిపూట నిద్ర పట్టదు. దీనికి కారణం శరీరం అలసిపోవడం ఒక్కటే నిద్ర రావడానికి సరిపోకపోవడమే. మెదడు నిద్రకు సిద్ధంగా ఉందా లేదా అనేది కూడా ముఖ్యమే. శరీరం అలసిపోయినా మన అంతర్గత జీవ గడియారం నిద్రపోయే సమయం వచ్చిందనే సంకేతాన్ని ఇవ్వదు. ఈ గడియారాన్ని జీవ లయ అంటారు. ఇది దాదాపు 24 గంటల వ్యవధిలో నిద్ర, మెళకువతోపాటు శరీరంలోని అనేక ప్రక్రియలను నియంత్రిస్తుంది. వెలుతురు, ఉష్ణోగ్రత వంటి పరిసర పరిస్థితులు దీనిపై ప్రభావం చూపుతాయి.

మెలటోనిన్‌కు ఆటంకం కలిగితే..

మెదడులోని హైపోథాలమస్ ప్రాంతం జీవ లయను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పగటిపూట సహజమైన సూర్యకాంతి శరీరానికి మెళకువగా ఉండాల్సిన సమయమని సంకేతాలు ఇస్తుంది. చీకటి పడినప్పుడు నిద్రను ప్రోత్సహించే మెలటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఈ జీవ లయ నిద్రలోని వివిధ దశలను, ముఖ్యంగా గాఢ నిద్రను, స్వప్నాలతో సంబంధం ఉన్న ఆర్‌ఈఎం నిద్రను ప్రభావితం చేస్తుంది. అందువల్ల నిద్ర ఎంత నాణ్యంగా ఉందో, ఉదయం లేచినప్పుడు ఎంత ఉత్సాహంగా అనిపిస్తుందో కూడా దీనిపై ఆధారపడి ఉంటుంది. రాత్రిపూట ఫోన్, కంప్యూటర్ తెరలను ఎక్కువసేపు చూడడం వల్ల మెలటోనిన్ ఉత్పత్తికి ఆటంకం కలుగుతుంది. పని, సామాజిక మాధ్యమాలు, వార్తలు, ఒత్తిడి మెదడును ఇంకా చురుగ్గా ఉంచుతాయి.

ఉదయం కాంతి ముఖ్యం..

నిద్రను మెరుగుపరచుకోవడానికి ఉదయం కొంతసేపు సహజమైన వెలుతురులో గడపాలి. ఇది శరీర జీవ గడియారాన్ని క్రమబద్ధం చేయడానికి సహాయపడుతుంది. రాత్రిపూట ప్రకాశవంతమైన దీపాలు, ఫోన్ తెరల వినియోగాన్ని తగ్గించాలి. అవసరమైతే తెరలపై నీలి వెలుతురును తగ్గించే సదుపాయాలను ఉపయోగించుకోవాలి. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రించడం, ఉదయం ఒకే సమయానికి నిద్రలేవడం అలవాటు చేసుకోవాలి. వారాంతాల్లో కూడా ఈ క్రమాన్ని పాటించడం మంచిది. మధ్యాహ్నం తర్వాత, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో కాఫీ వంటి ఉత్తేజక పదార్థాలను తగ్గించాలి. ఇది నిద్ర పట్టడాన్ని ఆలస్యం చేస్తుంది.

నిద్రించే ముందు ఇలా చేయాలి..

నిద్రించే ముందు పుస్తకం చదవడం లేదా గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వంటి ప్రశాంతమైన పనులు చేయడం వల్ల శరీరం విశ్రాంతికి సిద్ధమవుతుంది. పగటిపూట నిద్రపోవాల్సి వస్తే 20 నుంచి 30 నిమిషాలకు పరిమితం చేయాలి. ముఖ్యంగా సాయంత్రం ఆలస్యంగా నిద్రపోవడం రాత్రి నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. నిద్రించే ముందు మెదడుకు విశ్రాంతి ఇవ్వడం, తెరల వినియోగాన్ని తగ్గించడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. శారీరక అలసట ఉన్నప్పటికీ నిద్ర రాకపోవడానికి జీవ లయలో మార్పులు ఒక కారణం అయ్యే అవకాశాలు ఉంటాయి.

ఎంపీ వద్దిరాజుకు దుర్గామాత కలశం,చీర బహుకరించిన బీఆర్ఎస్ నాయకుడు వేల్పుల దామోదర్

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 28 : కొత్తగూడెం మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు దుర్గామాత చీరతో పాటుగా కలశం బహుకరించారు.

పాత కొత్తగూడెం శక్తి సేన ఆధ్వర్యాన దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారి పూజా కార్యక్రమంలో ఉంచిన కలశం, చీరను బుధవారం సాయంత్రం ఎంపీ రవిచంద్రను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దామోదర్, ఆయన అనుచరులు కలిసి బహుకరించారు. దామోదర్‌తో పాటు ఎంపీ వద్దిరాజును కలిసిన వారిలో కిల్లారి ప్రసాద్ కుమార్, పడాల భాస్కర్, పోతురాజు నరేష్, పల్లపోతుల నాగేంద్ర, వట్టె నాగరాజు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్ సంజీవని ఆసుపత్రిలో అంజయ్య ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే ఆరా

- మానవత్వం చాటిన ఎమ్మెల్యే
- ప్రమాద బాధితుడికి పరామర్శ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచన

దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య: చందంపేట మండలం రేకులగడ్డ గ్రామానికి చెందిన కద్దాల అంజయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడగా దేవరకొండలోని సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి అంజయ్యను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలుక జలందర్ గౌడ్, సన్నాయిల ఉమామహేశ్వర్, కేతావత్ భధ్య నాయక్, చిలకల అంజయ్య, కేతావత్ రమేష్ నాయక్, బక్కతట్ల వెంకటయ్య, కేతావత్ లాల్ సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటుపై రీనల్ డీనర్వేషన్ అస్త్రం



రక్తపోటు.. ఇది మానవ శరీరంలోని అవయవాలు సక్రమంగా పనిచేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది. అయితే ఈ రక్తపోటు నియంత్రణలో ఉండాలి. అలా కాకుండా రక్తపోటు అధికమైతే పలు రకాల తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఈ అధిక రక్తపోటునే వైద్య పరిభాషలో హైపర్ టెన్షన్ లేదా హై బీపీ అంటారు. దీని వల్ల ముఖ్యంగా గుండెపోటు, పక్షవాతం, మూత్ర పిండాల సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం అధిక రక్తపోటు సమస్యతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది బాధపడుతున్నారు.

నరాల సంకేతాలే కీలకం!

రక్తపోటును నియంత్రించడంలో గుండె, రక్తనాళాలతో పాటు మెదడు, మూత్రపిండాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. వీటి మధ్య సింపథటిక్ నర్వస్ సిస్టమ్ ద్వారా నరాల సంకేతాలు నిరంతరం ప్రసారమవుతుంటాయి. ఈ వ్యవస్థ శరీరంలో రక్తప్రసరణ, ద్రవాల సమతుల్యత, రక్తనాళాల సంకోచం లాంటి ప్రక్రియలను ప్రభావితం చేస్తుంది. కొంతమందిలో ఈ నాడీ వ్యవస్థ అధికంగా క్రియాశీలం కావడం వల్ల మూత్రపిండాలు సోడియం, నీటిని ఎకువగా నిల్వ చేసుకోవడం, రక్తనాళాలు సంకోచించడం లాంటి మార్పులు చోటుచేసుకోవచ్చు. ఫలితంగా రక్తపోటు పెరిగే అవకాశం ఉంటుంది. సాధారణంగా మందులు ఈ ప్రక్రియల్లోని వివిధ దశలను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తాయి. అయితే, సరైన చికిత్స తీసుకుంటున్నప్పటికీ బీపీ నియంత్రణలోకి రాని కొందరు రోగుల్లో మూత్రపిండాల చుట్టూ ఉండే నరాల సంకేతాలను తగ్గిస్తే రక్తపోటును నియంత్రించవచ్చనే ఆలోచనతో రీనల్ డీనర్వేషన్ పద్ధతిని అభివృద్ధి చేశారు.

రీనల్ డీనర్వేషన్ అంటే..

రీనల్ డీనర్వేషన్ అనేది శస్త్రచికిత్సతో ఛాతీని తెరవాల్సిన అవసరం లేకుండా, రక్తనాళాల ద్వారా నిర్వహించే కాథెటర్ ఆధారిత చికిత్సా పద్ధతి. ఇందులో మూత్రపిండాలకు రక్తాన్ని సరఫరా చేసే రీనల్ ఆర్టరీల చుట్టూ ఉండే నరాల కార్యకలాపాలను తగ్గించేందుకు ప్రత్యేక పరికరాలను ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియలో సాధారణంగా తొడ లేదా మణికట్టు ప్రాంతంలోని రక్తనాళం ద్వారా పలుచని, సౌకర్యవంతమైన కాథెటర్‌ను లోపలికి ప్రవేశపెడతారు. వైద్యులు దాన్నిరీనల్ ఆర్టరీలవరకు తీసుకెళ్తారు. అనంతరం వైద్యపరికరం ఆధారంగా రేడియో ఫ్రీక్వెన్సీ శక్తి లేదా అల్ట్రాసౌండ్ శక్తిని ఉపయోగించి నరాలపై లక్ష్యిత చికిత్స అందిస్తారు. ఈ శక్తి రక్తనాళాల చుట్టూ ఉన్ననరాల కార్యకలాపాలను తగ్గించేందుకు ఉపయోగపడుతుంది.

యువతను అధికంగా వేధిస్తున్న నడుము నొప్పి సమస్య.. హెచ్చరిస్తున్న వైద్య నిపుణులు..

ఈ మధ్యకాలంలో యువతను కూడా నడుము నొప్పి వేధిస్తోంది. మొదట్లో అప్పుడప్పుడు వచ్చే అసౌకర్యంగా కనిపించే ఈ సమస్య, క్రమంగా రోజువారీ పనులకు ఆటంకం కలిగిస్తోంది. వంగడం, శరీరాన్ని సాగదీయడం, ఎక్కువసేపు నిలబడడం వంటి పనులు చేసినప్పుడు నొప్పి తీవ్రమవుతోంది. ఎక్కువసేపు ప్రయాణించడం, కార్యాలయానికి వెళ్లేటప్పుడు సంచులు మోయడం వల్ల కాళ్లలో నొప్పి, తిమ్మిరి వంటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. బరువైన వస్తువులను ఎత్తినప్పుడు నొప్పి మరింత పెరుగుతోంది. నొప్పిని నిర్లక్ష్యం చేస్తూ పనులు కొనసాగిస్తే, చివరకు సాధారణ పనులు చేయడం కూడా కష్టమవుతుంది. యోగా, తేలికపాటి వ్యాయామాలు కొంత ఉపశమనం కలిగిస్తాయి. అందువల్ల వెన్నెముక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అవసరం.

40 ఏళ్ల లోపు వయస్సు వారిలోనూ..

సాధారణంగా నడుము నొప్పి వయసు పెరిగినవారిలో ఎక్కువగా కనిపిస్తుందని భావిస్తారు. అయితే ప్రస్తుతం నలభై ఏళ్లలోపు యువత కూడా వెన్నెముక సమస్యలతో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. మహాజన్ ఇమేజింగ్ అండ్ ల్యాబ్స్ గణాంకాల ప్రకారం, 2025 సెప్టెంబర్ నుంచి 2026 సెప్టెంబర్ వరకు నమోదైన 29,532 వెన్నెముక పరీక్షల్లో 6,925 పరీక్షలు, అంటే సుమారు 23.5 శాతం, నలభై ఏళ్లలోపు వారికే జరిగాయి. అరవై ఏళ్లు పైబడినవారిలో 39 శాతం, నలభై నుంచి అరవై ఏళ్ల మధ్య వయసువారిలో సుమారు 37 శాతం పరీక్షలు నమోదయ్యాయి. ఎక్కువసేపు కూర్చోవడం, సుదీర్ఘ ప్రయాణాలు, శారీరక శ్రమ లేకపోవడం, కార్యాలయాల్లో సరైన కూర్చునే సౌకర్యాలు లేకపోవడం నడుము నొప్పికి కారణమవుతాయి.



కండరాలపై ఒత్తిడి,వెన్నెముకలోని డిస్కులకు సంబం ధించిన సమస్యలు కూడా నొప్పిని కలిగిస్తాయి.

శారీరక శ్రమ ఉండాలి..

నడుము నొప్పి వచ్చిన ప్రతిసారీ ఎక్స్‌రే లేదా ఎంఆర్ఐ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. రోగి లక్షణాలు, వైద్య చరిత్ర, వైద్య పరీక్షల ఆధారంగా ఈ పరీక్షలు అవసరమా లేదా అనేది నిర్ణయించాలి. ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోకుండా మధ్యమధ్యలో లేచి నడవడం, పని చేసే ప్రదేశంలో కూర్చునే విధానాన్ని సరిచేసుకోవడం, క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం, కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయడం ద్వారా వెన్నెముక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. నొప్పి నిరంతరంగా ఉండడం లేదా తరచూ తిరిగి రావడం వంటి పరిస్థితుల్లో నొప్పి నివారణ మందులపైనే ఆధారపడకుండా వైద్యులను సంప్రదించాలి. క్రమంగా పెరుగుతున్న బలహీనత, తీవ్రమైన తిమ్మిరి, మూత్ర లేదా మల విసర్జన నియంత్రణలో మార్పులు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి.

గణాంకాలు ఏం చెబుతున్నాయి..

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, 2020లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 61.9 కోట్ల మంది నడుము కింది భాగంలో నొప్పితో బాధపడ్డారు. అంటే ప్రపంచవ్యాప్తంగా ప్రతి 13మందిలో ఒకరు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. 2050 నాటికి బాధితుల సంఖ్య 84.3 కోట్లకు చేరవచ్చని అంచనా. ప్రపంచ వ్యాప్తంగా వైకల్యానికి ప్రధాన కారణంగా నడుము కింది భాగంలో వచ్చే నొప్పి గుర్తించబడింది. ఈ సమస్య వల్ల కదలికలు తగ్గడంతోపాటు రోజువారీ పనులు, ఉద్యోగ నిర్వహణ కూడా ప్రభావితమవుతాయి. 2012లో ఆర్థరైటిస్ అండ్ రుమాటిజం జర్నల్‌లో ప్రచురితమైన సమీక్షలో 54 దేశాలకు చెందిన 165 అధ్యయనాలను పరిశీలించారు. ఏ సమయంలోనైనా 11.9 శాతం మందికి నడుము కింది భాగంలో నొప్పి ఉంటుందని, ఒక నెల వ్యవధిలో 23.2 శాతం మంది ఈ సమస్యను అనుభవిస్తారని ఆ సమీక్ష అంచనా వేసింది. యువతలోనూ ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా, నొప్పికి కారణాన్ని గుర్తించి తగిన వైద్య సలహా తీసుకోవడం ముఖ్యమని నిపుణులు తెలియజేస్తున్నారు.

చేపలు తినని వారికి గుడ్‌న్యూస్.. ఒమేగా 3 అందించే ఆహారాలు ఇవే!

గుండె పనితీరుని మెరుగ్గా ఉంచడం, నాడీ కణాలకు రక్షణ పొరను నిర్మించడం, రక్త నాళాల్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్, ప్లేట్‌లెట్స్, క్యాల్షియం లాంటి వాటిని తీసేయడానికి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉపయోగపడతాయి. ఒమేగా 3ఫ్యాటీ యాసిడ్స్ లోపం లేకుండా ఉండాలంటే చేపలు బాగా తినాలని చాలామంది సలహాలిస్తారు. చేపల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండేది నిజమే. కానీ, వాటిల్లోనే ఉంటుందని, అధికంగా ఉంటుందనేవి భ్రమలే. వంద గ్రాముల చేపలో 2.5 నుంచి 3 గ్రాములే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. మార్కెట్లో తక్కువ ధరలో ఉండే మెంతి కూర, మునగాకు, అవిసె గింజల్లో అంతకంటే ఎక్కువ మోతాదులో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. వంద గ్రాముల అవిసె గింజల్లో 22 గ్రాములు, చియా గింజల్లో 17 గ్రాములు, వాల్‌నట్స్‌లో 9 గ్రాముల వరకు ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. కాబట్టి చురుకైన మెదడు, గుండె ఆరోగ్యం కోసం చేపలు తింటే మంచిది. తినకపోతే ప్రమాదం అనేది అవాస్తవం. ఏది తిన్నా ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండే ఆహారం వారానికి రెండు రోజులు తీసుకుంటే మంచిది. చేపలు తింటే గుండె ఆరోగ్యానికి మేలు అన్నది నిజమే. కానీ, చేపలు తినని వాళ్లకు నష్టమన్నదాంట్లో నిజం లేదు.

మూడు ఆసియా పారా గేమ్స్ స్వర్ణాలు సాధించిన నీరజ్ యాదవ్ మృతి

డోపింగ్ సస్పెన్షన్‌తో ఇటీవల పోటీలకు దూరం.. మృతిపై దర్యాప్తు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28: భారత పారా క్రీడా రంగంలో విషాదం చోటుచేసుకుంది. మూడుసార్లు ఆసియా పారా గేమ్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన ప్రముఖ పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ మృతి చెందారు. ఆయన తన నివాసంలో విషం తీసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ విషయాన్ని భారత పారా అథ్లెటిక్స్ జట్టు ప్రధాన కోచ్ ఎస్. సత్యనారాయణ ధ్రువీకరించారు. ఆయన మృతదేహానికి ఢిల్లీలోని ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించేందుకు తరలించినట్లు సమాచారం. **క్రీడా జీవితంలో ఎన్నో విజయాలు** ఉత్తరప్రదేశ్‌కు చెందిన నీరజ్ యాదవ్ చిన్నతనంలోనే పోలియో బారినపడినప్పటికీ, క్రీడలపై ఆసక్తితో ముందుకు సాగారు. తొలుత వీల్‌చైర్ టెన్నిస్‌లో పాల్గొన్న ఆయన, 2015లో పారా అథ్లెటిక్స్ వైపు అడుగులు వేశారు. జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రతిభ చాటారు. 2015లో ఢిల్లీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి గుర్తింపు పొందారు. 2018లో ఇండోనేషియాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో పురుషుల ఎఫ్55 జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు ఆసియా రికార్డు నెలకొల్పారు. అనంతరం 2023లో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో మరో రెండు స్వర్ణ పతకాలను గెలుచుకున్నారు. దీంతో ఆసియా పారా గేమ్స్‌లో ఆయన సాధించిన స్వర్ణ పతకాల సంఖ్య మూడుకు చేరింది. **డోపింగ్ కేసుతో నిలిచిన క్రీడా ప్రయాణం** 2023లో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ నిర్వహించిన పరీక్షలో ఆయన నమూనాలో నిషేధిత పదార్థం ఉన్నట్లు తేలడంతో డోపింగ్ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ పరీక్ష ఫలితాలను నీరజ్ యాదవ్ సవాలు చేసినట్లు

వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంలో ఆయనపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. దీంతో ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన ఐచినగోయా ఆసియా పారా గేమ్స్‌లో ఆయన పాల్గొనలేకపోయారు. పోటీలకు దూరం కావడం వల్ల ఆయన తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఉండవచ్చని కోచ్ అభిప్రాయపడినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. అయితే, నీరజ్ యాదవ్ మృతికి ఇదే కారణమని నిర్ధారించే అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు. **కారణాలపై కొనసాగుతున్న ఉత్కంఠ** నీరజ్ యాదవ్ మృతికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఇతర అంశాలపై అధికారులు దర్యాప్తు చేయనున్నారు. చిన్నతనంలో ఎదురైన శారీరక సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అథ్లెట్ మృతి భారత పారా క్రీడా రంగంలో విషాదాన్ని నింపింది.

టీమిండియా చాలా ప్రమాదకరమైన జట్టు!

అందుకే మా జట్టును ప్రశంసించా.. వెస్టిండీస్ కోచ్ డారెన్ శామీ

హైదరాబాద్, అక్టోబర్ 28: న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో టీమిండియా దూకుడైన ఆటతీరుపై వెస్టిండీస్ జట్టు ప్రధాన కోచ్ డారెన్ శామీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్ అత్యంత ప్రమాదకరమైన జట్టని, అలాంటి జట్టుతో భారత్‌లోనే తలపడి తమ జట్టు సాధించిన ఫలితం గొప్పదని పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత బ్యాటర్లు చెలరేగిన తీరు తన అభిప్రాయాన్ని మరోసారి గుర్తు చేసిందని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించాడు. **బౌలర్లకు సవాలుగా పరిస్థితులు** చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు, తడి బంతితో బౌలింగ్ చేయాల్సిన పరిస్థితులు బ్యాటర్లకు కలిసొస్తాయని శామీ పేర్కొన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో టీమిండియాను ఎదుర్కోవడం ఎంత కష్టమో తాజా మ్యాచ్ మరోసారి నిరూపించిందని తెలిపాడు. ఇటీవల భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ వర్షం కారణంగా చివరి మ్యాచ్ రద్దు కావడంతో 22తో ముగిసింది. ఈ నేపథ్యంలో తమ జట్టు ప్రదర్శనను ప్రశంసించడంలో తప్పేమీ లేదని శామీ వ్యాఖ్యల సారాంశం. **అభిషేక్ శర్మ విధ్వంసకర ఇన్నింగ్స్** న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన మూడో టీ20లో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించి ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. యువ బ్యాటర్ అభిషేక్ శర్మ కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 19 బంతుల్లో 45 పరుగులు సాధించి జట్టు విజయానికి కీలక సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి 7.1 ఓవర్లలోనే 133 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. **భారత్ జోరుకు కివీస్ కళ్లెం వేయగలదా?** ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 30 ఆధిక్యాన్ని సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. వరుస విజయాలతో భారత జట్టు దూకుడు ప్రదర్శిస్తుండగా, మిగిలిన మ్యాచ్‌ల్లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని న్యూజిలాండ్ భావిస్తోంది. మరోవైపు, భారత్‌తో జరిగిన సిరీస్‌లో తమ జట్టు చూపిన పోరాటాన్ని సమర్థించుకునేలా శామీ వ్యాఖ్యలు చేశాడు. ఆధునిక టీ20 క్రికెట్‌లో బ్యాటర్ల దూకుడు, మైదాన పరిస్థితులు బౌలర్లకు ఎలాంటి సవాళ్లు విసురుతున్నాయో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

పాక్ గడ్డపై చరిత్ర సృష్టించిన లంక బౌలర్!

30 ఏళ్ల రికార్డు బద్దలు.. ఐదు వికెట్లతో దిల్షాన్ మదుషంక సంచలనం

లాహోర్, అక్టోబర్ 28: శ్రీలంక యువ పేసర్ దిల్షాన్ మదుషంక పాకిస్థాన్ గడ్డపై చరిత్ర సృష్టించాడు. వన్డే ముక్కోణపు సిరీస్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో అదరగొట్టాడు. 8.3 ఓవర్లలో 34 పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. దీంతో పాకిస్థాన్ గడ్డపై ఆతిథ్య జట్టుపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన విదేశీ పేసర్‌గా రికార్డు సాధించాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ పేరిట ఉన్న 30 ఏళ్ల రికార్డును అధిగమించాడు. **పాక్ బ్యాటింగ్ పతనం** లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ శ్రీలంక బౌలర్ల ధాటికి 25.3 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌటైంది. బాబర్ ఆజమ్ 29 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. మదుషంక ఫఖర్ జమాన్, సాద్ బేగ్, అరాఫత్ మిన్హాస్, షాహీన్ షా అఫ్రిది, హారీస్ రవూఫ్‌లను పెవిలియన్‌కు పంపాడు. అతడి ధాటికి పాక్ బ్యాటింగ్ కుప్పకూలింది. **క్రిస్ హారిస్ రికార్డు బద్దలు** 1996లో న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ పాకిస్థాన్‌పై 42 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. అప్పటి నుంచి కొనసాగుతున్న రికార్డును మదుషంక 5/34 గణాంకాలతో తిరగరాశాడు. పాకిస్థాన్ గడ్డపై ఆతిథ్య జట్టుపై విదేశీ పేసర్లు సాధించిన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా ఇది నిలిచింది. **శ్రీలంక ఘన విజయం** బౌలింగ్‌లో సత్తా చాటిన శ్రీలంక, బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. 111 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. కమిందు మెండిస్ అజేయంగా 62 పరుగులు చేయగా, పావన్ రత్నాయకే 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో శ్రీలంక ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ముక్కోణపు సిరీస్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన మదుషంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

రాణించిన అభిరథ్, రాహుల్

- పంజాబ్‌పై హైదరాబాద్ దీటైన పోరు.. తొలి ఇన్నింగ్స్‌లో 193/2

హైదరాబాద్, అక్టోబర్ 28: రంజీ ట్రోఫీ మూడో రౌండ్ పోటీల్లో భాగంగా పంజాబ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు దీటుగా బదులిస్తోంది. పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగులకు ఆలౌట్ కాగా, రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ 54 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. అభిరథ్ రెడ్డి, రాహుల్ రాదేశ్ అర్ధశతకాలతో రాణించి జట్టును పోటీలో నిలిపారు. **సెంచరీకి మూడు పరుగుల దూరంలో అభిరథ్** హైదరాబాద్ ఓపెనర్ అభిరథ్ రెడ్డి అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 140 బంతులు ఎదుర్కొని 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 97 పరుగులు సాధించాడు. సెంచరీకి కేవలం మూడు పరుగుల దూరంలో ఉండగా ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ సలీల్ అరోరాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు రాహుల్ రాదేశ్ నిలకడగా ఆడుతూ 154 బంతుల్లో తొమ్మిది ఫోర్లతో 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. **రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం** తొలి వికెట్‌గా తన్మయ్ అగర్వాల్ రెండు పరుగులకే ఔటవడంతో హైదరాబాద్ 15 పరుగుల వద్ద వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత అభిరథ్, రాహుల్ కలిసి పంజాబ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు.

రెండో వికెట్‌కు 154 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు బలమైన పునాది వేశారు. ఆట ముగిసే సమయానికి రాహుల్‌తో పాటు కొడిమెల హిమతేజ ఎనిమిది పరుగులతో క్రీజులో ఉన్నాడు. **సాలిల్ అరోరా శతకం.. పంజాబ్ భారీ స్కోరు** అంతకుముందు పంజాబ్ వికెట్ కీపర్ బ్యాటర్ సాలిల్ అరోరా 268 బంతుల్లో 11 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 151 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఉమేశ్ యాదవ్ 37 పరుగులతో అజేయంగా నిలిచాడు. చివరి వికెట్‌కు వీరిద్దరూ 116 పరుగులు జోడించడం విశేషం. హైదరాబాద్ బౌలర్లలో కెప్టెన్ సీవీ మిలింద్ నాలుగు వికెట్లు, రక్షణ్ రెడ్డి మూడు వికెట్లు పడగొట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించాలంటే మూడో రోజు హైదరాబాద్ బ్యాటర్లు మరింత బాధ్యతగా ఆడాల్సి ఉంది.

వైష్ణవి శర్మ సంచలనం.. ఐదు వికెట్లతో అదరగొట్టింది!

- జింబాబ్వే బ్యాటింగ్ పతనం.. భారత మహిళల జట్టు క్లీన్‌స్వీప్‌పై కన్ను

వడోదర, అక్టోబర్ 28: భారత మహిళల క్రికెట్‌లో యువ స్పిన్నర్ వైష్ణవి శర్మ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. జింబాబ్వేతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన చివరి వన్డేలో ఐదు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించింది. ఆమె ధాటికి జింబాబ్వే మహిళల జట్టు 39.5 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. వైష్ణవి 39 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీసుకుంది. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో ఆమెకు ఇదే తొలి ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం. **వరుసగా వికెట్లు తీసి.. ప్రత్యర్థికి షాక్** ఎడమచేతి వాటం స్పిన్నర్ వైష్ణవి తన బౌలింగ్‌తో జింబాబ్వే బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. బెలవ్డ్ బిజా (1), మోడెస్టర్ ముపాచిక్వా

(37), చిడెజా ధురురు, మిషెల్ మవుంగా, న్యాషా గ్వాంజురాలను పెవిలియన్‌కు పంపింది. దీంతో జింబాబ్వే భారీ స్కోరు సాధించే అవకాశాలు దెబ్బతిన్నాయి. భారత బౌలర్లలో సయాలి సత్ఘరే, క్రాంతి గౌడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టి తమ వంతు సహకారం అందించారు. **రెండో వన్డేలోనూ మెరిసిన వైష్ణవి** ఈ సిరీస్‌లో వైష్ణవి నిలకడైన ప్రదర్శన చేస్తోంది. రెండో వన్డేలోనూ నాలుగు వికెట్లు తీసి జింబాబ్వే బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీసింది. ఆ మ్యాచ్‌లో భారత జట్టు 121 పరుగుల తేడాతో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌లో 20తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. చివరి వన్డేలోనూ వైష్ణవి ఐదు వికెట్లతో చెలరేగడంతో భారత బౌలింగ్ బలం మరోసారి బయటపడింది. **క్లీన్‌స్వీప్‌కు భారత్ సిద్ధం** మూడో వన్డేలో జింబాబ్వేను 131 పరుగులకే పరిమితం చేయడంతో భారత్ ముందు 132 పరుగుల లక్ష్యం నిలిచింది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తే మూడు వన్డేల సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసినట్లవుతుంది. యువ బౌలర్ వైష్ణవి శర్మ ప్రదర్శన భారత మహిళల జట్టుకు మరింత ఆత్మవిశ్వాసాన్ని అందించింది.

ఏఐ ప్రమాదకరం

: డీప్ ఫేక్ వీడియోలపై కృతి సనన్ పోరాటం

ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దుర్వినియోగంపై న్యాయపోరాటానికి దిగారు. తన వ్యక్తిత్వ, ప్రచార హక్కులను (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) కాపాడాలంటూ ఆమె ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి తన అనుమతి లేకుండా డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్ ఎండార్స్‌మెంట్లు సృష్టించకుండా అడ్డుకోవాలని ఆమె కోరారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. వ్యక్తిత్వ హక్కులకు సంబంధించిన అంశాలపై మరిన్ని వివరాలు, గత తీర్పులను సమర్పించాలని కృతి తరఫు న్యాయవాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడిన కృతి సనన్, ఏఐ టెక్నాలజీ తనను తీవ్రంగా భయపెడుతోందని వ్యాఖ్యానించారు. "ఏఐ ఒక పదునైన కత్తి లాంటిది, అది ఎంత పదునుగా ఉంటే అంత ప్రమాదకరం" అని ఆమె అన్నారు. సోషల్ మీడియాలో ఏఐ ద్వారా సృష్టించిన తన ఫొటోలను రిపోర్ట్ చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె కోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న 51వ సినిమా షూటింగ్ పూర్తి

విలక్షణ నటుడు నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ పూర్తయింది. ఆయన కెరీర్‌లో ఇది 51వ చిత్రం కావడంతో, తాత్కాలికంగా 'ఎన్‌సీ 51' అనే టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను పిలుస్తున్నారు. ఆర్.పి. బాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ముగిసింది. ఈ విషయాన్ని నవీన్ చంద్ర స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు.

ఈ చిత్రంలో నవీన్ చంద్ర సరసన హరిప్రియ రోషిణి హీరోయిన్‌గా నటిస్తుండగా, బాల శరవణన్, కాళీ వెంకట్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ వినూత్నమైన కథాంశంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. దర్శకుడు ఆర్.పి. బాల ఈ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పి.జి. ముత్తయ్య మరో నిర్మాతగా ఉంటూ సినిమాకు ఛాయాగ్రహణం అందిస్తున్నారు. శక్తి బాలాజీ సంగీతం, అజయ్ మనోజ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అధికారిక టైటిల్, ఫస్ట్ లుక్ వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.

'దొంగ నా కొడుకు' నుంచి 'ఓ మై గాడ్' సాంగ్ రిలీజ్!

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వస్తున్న వినూత్న చిత్రం 'దొంగ నా కొడుకు'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ క్రైమ్ కామెడీ సినిమాకు శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నవంబర్ 13న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమాపై అంచనాలను పెంచేలా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ తాజాగా 'ఓ మై గాడ్' ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం! రామ్ మిరియాల ఎనర్జిటిక్ వాయిస్‌తో మ్యాజిక్: సింజిత్ ఎర్రమిల్లి స్వరపరిచిన 'ఓ మై గాడ్' పాట రొమాంటిక్‌గా, జోష్ నింపేలా ఉంది. ఆకట్టుకునే మ్యూజిక్, కొత్త తరహా బీట్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక సింగర్ రామ్ మిరియాల తనదైన ఎనర్జీ, ప్రత్యేకమైన వాయిస్‌తో ఈ పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. ఆయన డైనమిక్ వోకల్స్ పాటను మరో లెవెల్‌కి తీసుకెళ్లాయని చెప్పవచ్చు. భాస్కరభట్ల చక్కటి సాహిత్యం: ప్రేమలో పడిన హీరో తన మనసులోని ఫిలింగ్స్ భాస్కరభట్ల సాహిత్యం ద్వారా అందంగా పలికించారు. తన జీవితంలోకి ప్రేయసి వచ్చిన తర్వాత ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి, ఆమెతో గడిపే ప్రతి క్షణం ఎందుకు ప్రత్యేకంగా అనిపిస్తుందో ఈ పాటలో చూపించారు. ప్రేమలో కలిగే కొత్త ఉత్సాహం, అనుభూతులను ఈ పాట ఆకట్టుకునేలా రాసారు. అదిరిపోయే కొరియోగ్రఫీ: ఈ పాటకు ఆట సందీప్ అందించిన కొరియోగ్రఫీ చాలా అందంగా ఉంది. హీరో మౌళి తనూజ్ ప్రశాంత్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో ఆకట్టుకోగా, హీరోయిన్ సుష్మిత శెట్టితో ఆయన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఎంతో క్యూట్‌గా ఉంది. ఇక యూత్‌ఫుల్ రొమాంటిక్ వైబ్‌తో సాగిన ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ ఈ సాంగ్ ట్రెండ్ అవుతోంది. భారీ తారాగణం.. త్వరలోనే రిలీజ్: ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన మూవీ ఇప్పుడు ఈ మెలోడీ సాంగ్‌తో సినిమా ప్రమోషన్లను జోరుగా కొనసాగిస్తోంది. ఈ చిత్రంలో అలీ, రజిత, రఘుబాబు, ప్రియా, గుండు సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

లాస్ ఏంజిల్స్‌లో 'రామాయణ' స్పెషల్ స్క్రీనింగ్..



భారత సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎన్నో అంచనాల నడుమ తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో, రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నవంబర్ 5న దీపావళి కానుకగా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం అక్టోబర్ 27న లాస్ ఏంజిల్స్‌లో ఒక ప్రత్యేక ప్రీమియర్ షోను ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శన అనంతరం సినిమాపై తొలి రివ్యూలు సోషల్ మీడియాలో వచ్చేశాయి.

సినిమా చూసిన వారిలో చాలామంది దీన్ని ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా అభివర్ణించారు. విజువల్స్, సంగీతం, యాక్షన్ సన్నివేశాలు కనీవినీ ఎరుగని రీతిలో ఉన్నాయని కొనియాడారు. ఒక నెటిజన్ రాస్తూ.. ""రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్' అద్భుతంగా ఉంది. విజువల్స్, నృత్యాలు, సంగీతం, యాక్షన్ అన్నీ భారీ స్థాయిలో ఉన్నాయి. రణ్‌బీర్ కపూర్ నటన అమోఘం, యశ్ చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఈ ఏడాది అత్యంత గొప్ప సినిమాటిక్ అనుభవాలలో ఇదొకటి" అని పోస్ట్ చేశారు. మరొకరు "వచ్చే వారం బాక్సాఫీస్ వద్ద విధ్వంసం ఖాయం. బ్లాక్‌బస్టర్ గ్యారెంటీ! నటీనటులందరూ అద్భుతంగా నటించారు" అంటూ ప్రశంసించారు. ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటనకు ప్రేక్షకులు భావోద్వేగానికి గురయ్యారని పలువురు పేర్కొన్నారు. "రామాయణ చిత్రం ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. రణ్‌బీర్ ఒక అసాధారణ నటుడు. మేం గెలిచేశాం!" అంటూ ఒక అభిమాని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శనకు నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీ దంపతులు, రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి వంటి తారలందరూ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కాగా, సినిమాలో ఆత్మ లోపించిందని, దైవిక భావన లేదని, సంగీతం ఆశించిన స్థాయిలో లేదని కొందరు అభిప్రాయపడ్డారు. ఈ సినిమాను రెండు భాగాలుగా, సుమారు రూ. 4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా గతంలో వెల్లడించారు. "ఏడెనిమిదేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ మొదలుపెట్టినప్పుడు అందరూ నన్ను పిచ్చివాడిలా చూశారు. ప్రపంచంలోనే గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకెళుతున్నాం. హాలీవుడ్ సినిమాలతో పోలిస్తే మేం చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

మొత్తం మీద 'రామాయణ' చిత్రం అద్భుతమైన విజువల్స్, నటీనటుల ప్రతిభతో ప్రశంసలు అందుకుంటోంది. ఈ స్పందనల నడుమ నవంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

సందీప్ కిషన్ 'పవర్ పేట'.. 'పడమటి వీధి జానకి'గా రితికా నాయక్..

యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న ఆసక్తికర చిత్రం 'పవర్ పేట'. ఈ సినిమా నుంచి హీరోయిన్ రితికా నాయక్ పుట్టినరోజు (అక్టోబర్ 27) సందర్భంగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమెను 'పడమటి వీధి జానకి' అనే విభిన్నమైన పేరుతో పరిచయం చేశారు. విడుదలైన పోస్టర్‌లో రితికా నాయక్ ఎంతో సాంప్రదాయబద్ధంగా, హోమ్లీ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. క్రీమ్ కలర్ హాఫ్ శారీ, పింక్ దుపట్టా, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో పాటు సాంప్రదాయ ఆభరణాలు ధరించి, పాతకాలం నాటి ఇంట్లో హుందాగా కూర్చుని కనిపించారు. ఈ లుక్ ఆమె పాత్రపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, పోస్టర్‌లో డీగ్లామర్‌గా కనిపిస్తున్నప్పటికీ, సినిమాలో ఆమె కొన్ని గ్లామరస్ సన్నివేశాల్లో కూడా నటిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వర్షంలో కొన్ని సీన్లు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. రాజకీయం, ప్రేమ, అధికార పోరాటం వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమాను టాలెంటెడ్ డైరెక్టర్ కృష్ణ చైతన్య తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ ఇందులో 'సేనాపతి రవి' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తుండగా, 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ 60 శాతం పూర్తయింది. 'మిరాయ్', 'కొరియన్ కనకరాజు' వంటి విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న రితికా నాయక్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపిక కావడం విశేషం. గతంలో ఈ ప్రాజెక్ట్ పలువురు హీరోల వద్దకు వెళ్లినప్పటికీ, చివరికి సందీప్ కిషన్‌తో ఖరారైంది. తాజాగా విడుదలైన 'పడమటి వీధి జానకి' గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. సందీప్, రితికా మధ్య కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888